www.andhrajyothy.com
విజయవాడ సిటీ
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 11-4-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 357
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

| వరల్డోమీటర్ ప్రకారం శుక్రవారం రాత్రి 11:00 గంటలకు | మొత్తం కేసులు | కొత్త కేసులు | మొత్తం మృతులు | ఒక్కరోజులో మృతులు |
|---|---|---|---|---|
| ప్రపంచం | 16,67,675 | 91,179 | 1,00,482 | 6,907 |
| భారతదేశం | 6,761 | 896 | 206 | 37 |
| ఆంధ్రప్రదేశ్ | 381 | 18 | 6 | 0 |
| తెలంగాణ | 487 | 16 | 12 | 0 |
| అమెరికా | 4,88,844 | 34,229 | 17,995 | 1,921 |
| స్పెయిన్ | 1,57,053 | 4,607 | 15,970 | 732 |
| ఇటలీ | 1,47,577 | 3,951 | 18,849 | 570 |

శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 7.02 వరకు తదుపరి పంచమి; నక్షత్రం: అనూరాధ రా. 8.12 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 1.34-3.06; దుర్ముహూర్తం: ఉ. 6.06-7.45; అమృతఘడియలు: ఉ. 10.32-12.01; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.28

'ఎలాంటి మొహమాటాలూ వద్దు. ప్రధాని లాక్‌డౌన్ పొడిగించాలి'... అని పొరుగు రాష్ట్రమైన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సూటిగా చెప్పారు.

మరో పొరుగు రాష్ట్రం ఒడిసా ఇప్పటికే లాక్‌డౌన్‌ను నెలాఖరుదాకా పొడిగించేసింది.

లాక్‌డౌన్ పొడిగించాలని పార్టీలు, వైద్య నిపుణులు తమిళనాడు ప్రభుత్వాన్ని కోరారు.

ఇక... కర్ణాటకలోనూ లాక్‌డౌన్ పొడిగింపు దిశగానే అడుగులు పడుతున్నాయి!

మరి... ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతోందో తెలుసా! కరోనా కేసుల సంగతి ఎలాఉన్నా సరే... లాక్‌డౌన్‌ను కట్టిపెట్టాలి. హుటాహుటిన స్థానిక ఎన్నికలు జరిపించేయాలి. దీనికి అడ్డుగా ఉన్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను తప్పించాలి. ఆ వెంటనే రాజధానిని తరలించాలి. రాజధాని కోసం సమీకరించిన భూముల్లోనే ఇతర ప్రాంతాల వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలి. కోర్టు ఉత్తర్వులు, రాజ్యాంగం, నైతిక నియమాలు... ఎలాగున్నా తాను అనుకున్నది చేసేయాలి. మరి... కరోనా తీవ్రత ఏమైనా తగ్గిందా అంటే, అదేమీ లేదు! రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి మూడో దశకు చేరుకుంది. కొత్త కేసులు బయట పడుతూనే ఉన్నాయి! అయినా... సరే మొండిగా ముందుకెళ్లడమే! దీనికి తాజా ఉదాహరణే... ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ తొలగింపునకు వీలుగా జారీ చేసిన ఆర్డినెన్స్! అది కూడా స్థానిక ఎన్నికల ప్రక్రియ మధ్యలో ఉండగానే.






# దొంగ దెబ్బ!

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌పై 'ఆర్డినెన్స్' వేటు

- ఇకపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి నియామకం
- ఆగమేఘాలపై ఆన్‌లైన్‌లో కేబినెట్ ఓకే
- ఆర్డినెన్స్‌పై గవర్నర్ ఆమోద ముద్ర
- వెంటనే రమేశ్ కుమార్ తొలగింపు...
- కొత్త ఎస్ఈసీ నియామకంపై జీవో
- ఉత్తర్వులన్నీ 'కాన్ఫిడెన్షియల్'గానే
- రాజ్యాంగ విరుద్ధంగా ఎస్ఈసీపై వేటు
- అలహాబాద్ కోర్టు తీర్పునకు స్వీయ భాష్యం
- స్ఫూర్తిని వదిలి... ఒక్క అంశంతో ముందుకు
- గవర్నర్‌నూ తప్పుదారి పట్టించారా!?

### అంత ఈజీ కాదు!

- హైకోర్టు జడ్జి అభిశంసనతో సమానం
- పార్లమెంటు ఆమోదంతోనే తొలగింపు?

## ఎస్ఈసీ పదవీకాలం మూడేళ్లకు కుదింపు

**చర్య**
కరోనా తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మంచిది కాదని... వాటిని వాయిదా వేయడం!

**ప్రతిచర్య**
తమ అభీష్టానికి భిన్నంగా వ్యవహరించి, స్థానిక ఎన్నికలు వాయిదా వేసిన... రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను పదవి నుంచి తప్పించడం!

**మార్గం...**
రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలాన్ని ఆర్డినెన్స్ ద్వారా కుదించడం! దీనికి ఆధారం... అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పునకు తమకు 'అనుకూలమైన' భాష్యం చెప్పుకోవడం!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రపంచం, దేశం, రాష్ట్రవ్యాప్తంగా కరోనా కలకలం చెలరేగుతున్న వేళ... రాష్ట్ర ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎన్నికలను వాయిదా వేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. ఎస్ఈసీ పదవీ కాలాన్ని మూడేళ్లకు కుదించింది. ఇప్పటిదాకా రిటైర్డ్ ఐఏఎస్‌లకు అప్పగిస్తున్న ఆ పదవిలో... హైకోర్టు రిటైర్డ్ జడ్జిలను నియమించేలా మరో మార్పు తీసుకొచ్చింది. శుక్రవారం

మిగతా 7వ పేజీలో...

### రాజధాని తరలాలి.. ఎన్నికలు జరగాలి!

- కరోనా టైంలోనూ సర్కారుకదే ఆలోచన
- రాష్ట్రంలో వైరస్ తీవ్రత పెద్దగా లేదట!
- లాక్‌డౌన్ ఎత్తివేతకు సర్కారు మద్దతు?
- స్థానిక ఎన్నికల నిర్వహణకే పట్టు 3,7

### మాట వినకుంటే వేటే!

సీఎస్ నుంచి ఉద్యోగి వరకు ఎవరైనా 'అధికార' కత్తికి బలే

### నగరి కమిషనర్‌పై వేటు

పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్

తహశీల్దార్ వనజాక్షిపై చర్యలు

---

లాక్‌డౌన్ ఎత్తేస్తే ఆర్థిక వ్యవస్థకు మేలు. కానీ ఆరోగ్య వ్యవస్థ సంక్షోభంలో పడొచ్చు.

ఎత్తేయకపోతే కరోనా ఉధృతి తగ్గొచ్చు గానీ.. ఆర్థిక వ్యవస్థ మునిగిపోయే ముప్పుంది.

'ముందు నుయ్యి వెనక గొయ్యి' అనే సామెత చందంగా ఉంది ప్రభుత్వం పరిస్థితి.

టు బి.. ఆర్.. నాట్ టు బి..! లాక్‌డౌన్ ఎత్తేయాలా? వద్దా? ఎత్తేస్తే.. ఎలా ముందుకు వెళ్లాలి?

కోట్లాది మంది భారతీయుల ఉపాధికి సంబంధించిన సమస్య ఇది. ఆరోగ్యానికి సంబంధించిన సంక్షోభమిది. రెండింటినీ సమతుల్యం చేస్తూ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది!




# ఎలా.. ఎత్తేయాలి?

## లాక్‌డౌన్‌పై నిపుణుల మల్లగుల్లాలు

- ఎత్తేస్తే కరోనా విస్తరించే ప్రమాదం
- ఎత్తేయకపోతే ఆర్థిక వ్యవస్థ పతనం
- కరువు కాటకాలూ సంభవించే ముప్పు
- 23 శాతానికి నిరుద్యోగం: సీఎంఐఈ
- పట్టణ ప్రాంతాల్లో 30.9 శాతానికి!
- క్లస్టర్ కంటెయిన్‌మెంట్ వ్యూహాన్ని పాటించాలని నిపుణుల సూచన
- వైరస్ విస్తృతి ఎక్కువగా ఉన్న చోట్ల కఠినంగా లాక్‌డౌన్ ఆంక్షల అమలు
- లేని చోట్ల.. కొన్ని షరతులతో ఎత్తివేత

మూడువారాల లాక్‌డౌన్ మరో మూడు రోజుల్లో ముగియబోతోంది! ఆ తర్వాత ఏం చేయాలి? పద్మవ్యూహంలోకి ప్రవేశించినట్టు ఉంది సర్కారు పరిస్థితి. లాక్‌డౌన్ అనే పద్మవ్యూహంలోకి దాదాపు మూడువారాల క్రితం ప్రవేశం జరిగిపోయింది. అప్పటికి అదే కరెక్టు. ఆ విషయంలో ఎవరికీ భిన్నాభిప్రాయాలు లేవు. కానీ, దాన్ని పొడిగించాలా వద్దా అనే అంశంపై మాత్రం జాగ్రత్తగా ఆలోచించి

మిగతా 2వ పేజీలో...

### పంజాబ్‌లో మే1 వరకు పొడిగింపు

పొడిగించడమే ఉత్తమం
88% మంది అభిప్రాయం 8

### లాక్‌డౌన్‌పై నేడే స్పష్టత

- సీఎంలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్
- అనంతరం జాతినుద్దేశించి ప్రసంగం?
- పొడిగిస్తే నిబంధనల్లో మార్పులు 2
- వైరస్ నియంత్రణపై పీఎంవో సమీక్ష



---



ఐసీఎంఆర్ దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 5911 మందికి ర్యాండమ్‌గా శాంపిల్స్ సేకరించగా 104 మందికి కరోనా వచ్చింది. అందులో 40 మందికి ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు.

దేశంలో సర్వే చేసిన వారిలో 1.8% మందికి కరోనా వచ్చింది.

తెలంగాణలో 2 జిల్లాలో శాంపిల్స్ సర్వే చేయగా 4% మందికి పాజిటివ్ వచ్చింది.

ఆంధ్రప్రదేశ్‌లో 2 జిల్లాల్లో శాంపిల్స్ సర్వే చేయగా 3.4 శాతం పాజిటివ్ వచ్చింది.

# సామాజిక వ్యాప్తి?

## భారత్‌లో జరిగి ఉండొచ్చన్న ఐసీఎంఆర్.. అదేం లేదన్న కేంద్రం

**ఉందని గతంలో చెప్పిన డబ్ల్యూహెచ్‌వో.. లేదంటూ తాజాగా మాట మార్పు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : కరోనా వైరస్ భారత్‌లో 'సామాజిక వ్యాప్తి' దశలో ఉందా? అనే దానిపై విభిన్న వాదనలు, అంచనాలు తెరపైకి వస్తున్నాయి. ఐసీఎంఆర్, కేంద్ర ప్రభుత్వం, డబ్ల్యూహెచ్‌వోలు తీరొక్క సమాధానాన్ని వినిపిస్తున్నాయి. తాజాగా భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) జరిపిన అధ్యయనంలో 'సామాజిక వ్యాప్తి' జరిగి ఉండొచ్చని వెల్లడైంది. ఆ సంస్థ ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 మధ్యకాలంలో 20 రాష్ట్రాల్లోని 52 జిల్లాల్లో తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న 5,911 మంది నుంచి శాంపిళ్లు సేకరించి కరోనా నిర్ధారణ పరీక్షలు జరిపింది. ఇందులో 104 మంది.. అంటే 1.8 శాతం మందికి కొవిడ్-19 ఉన్నట్లు తేలింది. ఈ 104 మందిలో 40 మంది విదేశాల ముఖం చూడనివాళ్లేనని, కనీసం విదేశాలకు వెళ్లి వచ్చినవారిని కూడా వారు కలవలేదని విచారణలో నిర్ధారించారు. వీరంతా 15 రాష్ట్రాల్లోని 36 జిల్లాలకు చెందిన వారు. ఈ గణాంకాలు మన దేశంలోని సింహభాగం రాష్ట్రాల్లో సామాజిక వ్యాప్తి

మిగతా 8వ పేజీలో...

# 896 కొత్త కేసులు

## దేశంలో ఇప్పటి వరకు ఇదే అత్యధికం


న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: లాక్‌డౌన్ గడువు మరో మూడు రోజుల్లో ముగియనున్న తరుణంలోనూ దేశంలో కరోనా వైరస్ కేసులు భారీగా నమోదవుతున్నాయి. 24 గంటల్లో రికార్డు స్థాయిలో 896 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు ఇదే అత్యధికం. ఒక్క రోజే 37 మరణాలు సంభవించాయి. దేశంలో ఇప్పటి వరకు 6,761 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ బారినపడి 206 మంది మరణించారని తెలిపింది. యాక్టివ్ కేసులు 6,039

మిగతా 8వ పేజీలో...

---

### ఎన్నికల ప్రక్రియ మధ్యలో..

# కమిషనర్ తొలగింపా? 3



- ఇది న్యాయసూత్రాలకు వ్యతిరేకం
- ఆర్డినెన్స్‌ను ఆమోదించవద్దు
- ప్రజాస్వామ్య విలువలు కాపాడండి
- గవర్నర్‌కు చంద్రబాబు లేఖ
- పదవీకాలం తగ్గింపంటే తొలగింపే
- ఆ అధికారం పార్లమెంటుకే ఉంది
- ఆర్డినెన్స్‌ను ఎలా ఆమోదిస్తారు?
- ఇది రాజ్యాంగ విరుద్ధం: యనమల

### నీట్ పరీక్ష కేంద్రాల మార్పునకు అవకాశం 8

లాక్‌డౌన్ నేపథ్యంలో నిర్ణయం

### సరిహద్దుల్లో కాల్పుల హోరు 2

ఆర్టిలరీ గన్స్‌తో భారత్ ఎదురుదాడి



అనంతపురంలో ఎర్ర జెండాలతో రెడ్‌జోన్ ప్రాంతం దిగ్బంధం

### త్వరలోనే అదుపులోకి

- సాధారణ పరిస్థితులు ఏర్పడతాయి
- అంకిత భావంతో వైద్యుల సేవలు
- తెలీని భయమున్నా గట్టిగా విధుల్లో
- వారికి హ్యాట్సాఫ్..సెల్యూట్ చేస్తున్నా
- ప్రజారోగ్య వ్యవస్థలు బలపడితేనే కరోనాలాంటి వైరస్‌పై గెలవగలం
- విస్తరణ ప్రాంతాలపై దృష్టి: సీఎం 7

రాష్ట్రంలో

# 133 రెడ్‌జోన్లు

## నెల్లూరులో అత్యధికంగా 30.. అత్యల్పంగా అనంతలో 3

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం మినహా కరోనా పాజిటివ్ కేసులు నమోదైన 11 జిల్లాల్లో 133 ప్రాంతాలను ప్రభుత్వం 'రెడ్‌జోన్లు'గా గుర్తించింది. వీటిలో అత్యధికంగా నెల్లూరులో 30 ఉండగా, ఆ తర్వాత కర్నూలులో 22, కృష్ణాలో 16 ప్రాంతాలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో అతి తక్కువగా 3మాత్రమే ఉన్నాయి. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాలను కంటైన్మెంట్ క్లస్టర్లుగా గుర్తించడం ద్వారా రెడ్అలెర్ట్ ప్రకటించి వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం అన్ని చర్యలు

మిగతా 7వ పేజీలో...

### మహిళలపై పంజా

- రాష్ట్రంలో 18 కొత్త కేసులు.. వీరిలో 12 మంది మహిళలే 7
- అనంతలో నర్సుకు.. తూర్పులో తండ్రి నుంచి 8ఏళ్ల కూతురికి
- ఆమె ద్వారా పక్కింట్లో పసిపాపకు... పాప తల్లి, నానమ్మకూ..

### డాక్టర్ 'నిండు' మనసు!

**నెలలు నిండినా అత్యవసర విధులు**

ఈ వైద్యురాలి పేరు ఎస్ భాగ్యరేఖ. విజయనగరం జిల్లా జామి పీహెచ్‌సీ వైద్యాధికారిణి. ఆమె 8 నెలల గర్భిణి. ప్రసూతి సెలవులు వాడుకునే అవకాశమున్నా విధి నిర్వహణకే మొగ్గుచూపారు. ఇంటింటికీ వెళ్లి కరోనాపై అవగాహన కల్పిస్తున్నారు. అన్నట్లు విజయనగరం జిల్లాలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదు.

- శృంగవరపుకోట రూరల్



### ఆయుధాల్లేకుండా యుద్ధమా!



- పీపీఈ కిట్లు లేకుండానే ఐసొలేషన్‌కు
- మాస్కులు, గ్లౌజులు లేకుండా విధులు
- వైద్యులపై అధికారుల తీవ్ర ఒత్తిళ్లు
- ప్రశ్నిస్తే బెదిరింపులు.. లేదంటే సస్పెన్షన్
- ప్రభుత్వ చర్యల్ని ఓపిగ్గా భరిస్తున్న సిబ్బంది

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): యుద్ధానికి వెళ్లే సైనికుడు సకల ఆయుధాలు సమకూర్చుకుని రణరంగంలోకి దిగుతాడు. కానీ.. కరోనా వైరస్‌పై

మిగతా 8వ పేజీలో...

# ఉచిత పరీక్షలు

కరోనా నిర్ధారణ పరీక్షలన్నీ ఉచితంగా చేయాల్సిందేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాన్ని అత్యధికులు స్వాగతించారు. అసలే కష్టంలో ఉన్న ప్రజల నెత్తిన వ్యాధి నిర్ధారణ భారం పడకుండా ఈ ఆదేశం ఆపుతుందని సంతోషించారు. కొవిడ్ పరీక్షలన్నీ ఉచితంగా జరగాల్సిందేనన్న సుప్రీం మాట ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా వర్తిస్తుంది. గవర్నమెంటు పరీక్షలు ఎలాగూ ఉచితమే. ప్రభుత్వం ఇప్పటికే విధించిన నిబంధనలకు లోబడి, ప్రైవేటులో కూడా నాలుగున్నరవేల రూపాయలకు ఈ పరీక్ష అందుబాటులో ఉంది. 'ఈ సంక్షోభకాలంలో పరీక్ష ప్రజలందరికీ ఉచితంగా అందాలన్నదే మా కోరిక' అంటూనే, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి (ఐసీఎమ్ఆర్) మార్చి 21న ప్రైవేటు ల్యాబరేటరీలకు ఈ మొత్తాన్ని గరిష్ఠంగా నిర్ణయించింది. ఇకపై ఉచితంగా పరీక్షలు జరిపే ప్రైవేటు సంస్థలకు సదరు మొత్తాన్ని భవిష్యత్తులో భర్తీ చేయగలిగేదీ లేనిదీ చెప్పమంటూ సుప్రీంకోర్టు ప్రభుత్వానికి రెండువారాలు సమయం ఇచ్చింది. దేశంలో కొవిడ్ నిర్ధారణ పరీక్షల అవసరం అతి వేగంగా హెచ్చుతున్న నేపథ్యంలో, సుప్రీం తీర్పుకూ, ప్రభుత్వం చెప్పబోయే సమాధానానికీ ఎంతో ప్రాధాన్యం ఉన్నది.

దేశంలో ప్రస్తుతానికి 139 ప్రభుత్వ, 69 ప్రైవేటు ల్యాబరేటరీలు కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం వారం క్రితం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రైవేటు ఆస్పత్రులకు, పరీక్షలకు కూడా విస్తరింపచేసి సదరు పథకం కింద అర్హులైనవారికి కరోనా పరీక్షలు, చికిత్స ఉచితంగా అందేట్టు చూసింది కూడా. ప్రైవేటు కేంద్రాల్లో పరీక్షల అవసరం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, అవీ ఉచితమేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం వాస్తవికంగా ప్రజలకు మేలు చేస్తుందా? అన్నది ప్రశ్న. ఈ సంక్షోభకాలంలో ప్రభుత్వాల నిర్ణయాలను అవి తూచ తప్పకుండా పాటించాల్సిందే. ప్రైవేటు సంస్థలన్నీ ఐసీఎమ్ఆర్ విధించిన ధరకు లోబడటమే కాక, వాటిలో కొన్ని తాము మరింత తక్కువ ధరకు పరీక్షలు అందిస్తున్నట్టు కూడా చెబుతున్నాయి. దేశంలో కనీసం పదిశాతం జనాభా ఈ ఖర్చును భరించగలిగే స్థితిలో ఉంటూ, ఇప్పటికే పెద్ద సంఖ్యలో జనం తమ వద్ద పరీక్షలు కూడా చేయించుకుంటున్న స్థితిలో, సుప్రీం ఆదేశం తమ బోటి సంస్థలు ఆర్థికంగా దెబ్బతినడానికీ, అంతిమంగా పరీక్షల సంఖ్య తగ్గిపోవడానికీ కారణమవుతుందని వాటి వాదన. ఒకపక్క ప్రైవేటు కూడా బలంగా ఉంటేనే, ప్రభుత్వపరంగా జరిగే ఉచిత పరీక్షలు పేదలకు సంపూర్ణంగా అందచేయడం సాధ్యపడుతుందని అంటున్నాయి. పీపీఈ కిట్లు, గ్లౌజులతో పాటు నిర్ధారణ పరీక్షలకు అవసరమయ్యే మొత్తం సామగ్రిని ప్రభుత్వమే ఇచ్చి ఉచితంగా పరీక్షలు జరపమన్నా అభ్యంతరం లేదని కొన్ని సంస్థలు అంటున్నాయి. కనీసం రెండున్నరవేల రూపాయలు భర్తీచేసినా సరిపోతుందని మరికొన్ని అంటున్నాయి. కరోనా ముందుకాలం నాటి వ్యాపారం పూర్తిగా కోల్పోయి, కేవలం కొవిడ్ పరీక్షలు మాత్రమే మిగిలివున్న నేపథ్యంలో పూర్తి ఉచితాన్ని ప్రైవేటు ల్యాబరేటరీలు భరించగల స్థితిలో లేవనీ, అదే జరిగితే అవి అంతిమంగా బాధ్యతనుంచి తప్పించుకోవడమో, మూసుకోవడమో జరుగుతుందన్నది ఈ వాదనల సారాంశం.

సుప్రీం తీర్పు నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కచ్చితంగా ఉభయతారకంగా ఉండే మార్గాన్ని ఎంచుకోక తప్పదు. ప్రైవేటు సంస్థలకు లాభం మాట అటుంచి, పరీక్ష, నిర్వహణ వ్యయాల్లో కొంతైనా కలిసిరాకపోతే అవి సిద్ధపడవు. పరీక్షల సంఖ్య విపరీతంగా పెంచాలని ప్రభుత్వాలన్నీ అనుకుంటున్న దశలో పరిమిత మొత్తాన్ని చెల్లించడం ద్వారా అవి మనుగడలో ఉండేట్టు చూడవచ్చు. ఇక, సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చిన మరునాడే, కరోనా కష్టాలు వీడేవరకూ దేశంలోని ప్రైవేటు వైద్య వ్యవస్థనంతా జాతీయం చేయాలంటూ ఓ పిటిషన్ దాఖలైంది. అతి తక్కువ బడ్జెట్ కేటాయింపులతో కునారిల్లిపోయిన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలు కరోనాకు ఎదురొడ్డలేవనీ, ఇంతకాలమూ దేశ ప్రజల ఆరోగ్య అవసరాలనుంచి బాగా లబ్ధిపొంది, ఎంతగానో బలపడ్డ ప్రైవేటు రంగాన్ని ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకోవడం ద్వారానే ప్రజలను రక్షించుకోగలుగుతామని పిటిషనర్ ద్వివేదీ అంటున్నారు. ప్రైవేటును పాక్షికంగా తమ అధీనంలోకి తెచ్చుకున్న కొన్ని దేశాలను, ఆరోగ్యరంగాన్ని పూర్తిగా జాతీయం చేసిన స్పెయిన్‌ను ఆయన ఇందుకు నిదర్శనంగా చూపించారు. వైద్యరంగాన్ని సంపూర్ణంగా ప్రక్షాళించి, ప్రజావైద్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలకు ఇంతకు మించిన తరుణం దొరకదు.

# పేదలకు నగదు పంపిణీ



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రథమ కరోనా వైరస్ పాజిటివ్ కేసును 2019 డిసెంబర్ 30న చైనాలో గుర్తించారు. తొలుత వుహాన్ నగరంలోనూ, ఆ తరువాత హుబేయి రాష్ట్రంలోనూ ఆ వైరస్ వ్యాపించింది. దరిమిలా చైనాలోని ఇతర రాష్ట్రాలకు, ఇరుగు పొరుగు, సుదూర దేశాలకూ కరోనా విస్తరిల్లింది. ఈ సత్వర వ్యాప్తికి ప్రపంచం భీతిల్లిపోయింది. 2020 జనవరి ఆఖరు కల్లా 27 దేశాలు కొవిడ్ 19 తో బారిన పడ్డాయి.

2020 ఫిబ్రవరి 12న రాహుల్ గాంధీ ఇలా ట్వీట్ చేశారు: 'కరోనా వైరస్‌తో మన ప్రజలకు, మన ఆర్థిక వ్యవస్థకు ఒక మహోపద్రవం ముంచుకొస్తున్నది. మన ప్రభుత్వం ఈ ముప్పును తీవ్రంగా పరిగణించడం లేదని నేను అభిప్రాయపడుతున్నాను. ఈ మహమ్మారిని అరికట్టేందుకు సకాలంలో తగుచర్యలు చేపట్టడం చాలా ముఖ్యం'. ఫిబ్రవరి 12 నాటికి కేంద్ర ప్రభుత్వం రెండు చర్యలు మాత్రమే చేపట్టింది. అవి: నిర్దిష్ట దేశాలకు ప్రయాణించవద్దని 2020 జనవరి 17న దేశ ప్రజలకు సలహా ఇవ్వడం; కొన్ని దేశాల నుంచి వచ్చిన సందర్శకులకు జారీచేసిన ఈ వీసాలను ఫిబ్రవరి 3న తాత్కాలికంగా నిలిపివేయడం.

సరే, రాహుల్ ట్వీట్‌పై ఊహించినట్టుగానే సామాజిక మాధ్యమాలలో పోకిరీ వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. మచ్చుకు రెండు చూద్దాం. ఇకటి 'ఓ మేధావీ, తాజా వార్తలను చూశావా?' అని ఒక సరల్ పటేల్ పరిహాసాస్పదంగా ప్రశ్నించారు; రెండు 'భగవంతుడా, నీకు అభిప్రాయాలు కూడా వున్నాయా? మహాశయా, జోక్ చేయడం ఆపివేసి, పోగోను వీక్షించడానికి తిరిగి వెళ్ళు' అని పూజ అనే ఆమె స్పందించింది. మరి ఇప్పుడు ఈ సరల్ పటేల్, పూజలు ఎక్కడ దాక్కున్నారోనని నేను ఆశ్చర్యపోతున్నాను. మార్చి 3న రాహుల్ గాంధీ తన ట్వీట్‌లో ఇలా డిమాండ్ చేశారు: 'కరోనా సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సమృద్ధ నిధులతో ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాలి'.

మార్చి 14 నుంచి కేంద్ర ప్రభుత్వం కరోనా నిరోధక చర్యలు చేపట్టడం ప్రారంభించింది. నిర్దిష్ట దేశాల నుంచి వచ్చిన సందర్శకులను క్వారంటైన్ లో ఉంచింది; ఇరుగు పొరుగు దేశాలతో సరిహద్దులను మూసివేసింది; అంతర్జాతీయ విమానయాన సర్వీసులపై ఆంక్షలు విధించింది; దేశీయ విమానయాన సర్వీసులను నిషేధించింది; అంతిమంగా మార్చి 25 నుంచి దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను అమలుపరచడం ప్రారంభించింది.

ఈ ఘటనలను సింహావలోకనం చేసుకుంటే రాహుల్ గాంధీ తన విధ్యుక్త ధర్మాన్ని సరిగా పాటించారని స్పష్ట మవుతుంది. కరోనా విషమ సంక్షోభం విషయమై ప్రభుత్వాన్ని హెచ్చరించిన వారిలో ఆయన ప్రథముడు. కొన్ని రాష్ట్రాలు (కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్ , తమిళనాడు) కేంద్ర ప్రభుత్వం కంటే ముందుగానే కరోనా వైరస్ కట్టడికి పూనుకున్నాయి. తమ రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలో లాక్‌డౌన్‌లు ప్రకటించాయి కరోనా వ్యాప్తికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం మార్చిలో కాకుండా ఫిబ్రవరిలోనే పటిష్ఠ చర్యలు చేపట్టివలసివుంటుందా అనే విషయమై చర్చ కొవిడ్19 పై అంతిమ విజయం సాధించిన అనంతరం కూడా చాలా కాలం పాటు కొనసాగే అవకాశం ఎంతైనా వున్నది. కరోనా వైరస్ పై యుద్ధంలో దేశం సత్వర పురోగతి సాధించేందుకు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు, జీవనాధారాలను సంరక్షించేందుకు, మాంద్యంలోకి జారపోతున్న ఆర్థిక వ్యవస్థను రక్షించి, పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సాహసోపేత చర్యలు తీసుకోవాలి. ఈ విషయమై ప్రభుత్వాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా నేనీ వ్యాసాన్ని రాశాను.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్రింది అంశాలపై సత్వరమే తగుచర్యలు చేపట్టాలి. అవి: (1) వైరస్ వ్యాప్తి నియంత్రణ, వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్స; (2) పేదలు, ఇతర దుర్బల వర్గాల వారికి జీవనాధారాల పరంగా మద్దతు నివ్వడం; (3) నిత్యావసర సరుకుల, సేవల నిర్వహణ; (4) మాంద్యంలోకి దిగజారిపోతున్న ఆర్థిక వ్యవస్థను కాపాడి, పునరుద్ధరించడం.




పేద కుటుంబంగా గుర్తించిన ప్రతి కుటుంబపు బ్యాంకు ఖాతాలో మూడు రోజులలోగా మొదటి విడతగా రూ.5000 జమ చేయనున్నట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 14న జాతీయ టెలివిజన్‌లో ప్రకటించాలి. అర్హమైన కుటుంబానికి బ్యాంకు ఖాతా లేనిపక్షంలో ఆ సొమ్మును వారి నివాసానికి తీసుకువెళ్ళి అందజేయాలి. ఈ ఆర్థిక వితరణకు అయ్యే మొత్తం గరిష్ఠంగా రూ.65,000 కోట్ల మేరకు వుంటుంది. పేదలకు ఈ సహాయం సంపూర్ణంగా భరింపదగినది, పరిపూర్ణంగా సాధ్యమైనది, ఆర్థికంగా వివేకవంతమైనది, సామాజికంగా అనివార్యమైనది.

మొదటి అంశం విషయంలో కేంద్ర ప్రభుత్వం తొలుత పలు తప్పులు చేసినప్పటికీ, ఆ తరువాత వాటిని సరిదిద్దుకున్నది. లాక్‌డౌన్‌ను పటిష్ఠంగా అమలుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వాలను పలు విధాల పురిగొల్పుతోంది. వైద్య నిపుణులు, ప్రతిపక్ష నేతల నుంచి వచ్చిన ఒత్తిళ్ల ఫలితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు చేట్టింది. ఆరోగ్య భద్రతా సదుపాయాలను, వైద్య సామగ్రి, వైద్యులు, నర్సులకు అవసరమైన ఆరోగ్య పరిరక్షణ పరికరాల మరింతగా సమకూర్చుకోవల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు నాయకత్వ పాత్ర వహించాలి. రెండో అంశం విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫల మవడం అమిత వ్యాకులత కలిగిస్తోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వా లకు ఆర్థిక మద్దతు నందించడం లేదు దేశ వనరులపైన మొదటి హక్కుల పేద ప్రజలదేనన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు.

కేంద్ర ప్రభుత్వం మార్చి 25 వ తేదీన ప్రకటించిన ఆర్థిక కార్యాచరణ పథకం పిసినారితనానికి తార్కాణంగా ఉన్నది. పలు వర్గాల వారిని పూర్తిగా ఉపేక్షించారు. ప్రభుత్వం నుంచి తమకేమీ సహాయమందదన్న భావనతోనే వలస శ్రామికులు పట్టణాలు, నగరాలను వీడి స్వగ్రామాలకు అనేక ప్రయాసలతో తిరిగి వెళ్ళిపోయారు. వారు తమతో పాటు కరోనా వైరస్‌ను కూడా పల్లెలకు తీసుకువెళ్ళడం ఒక విషాదం. దీని పర్యవసానాలను మనం ఇంకా అవగతం చేసుకోవల్సి వున్నది.

రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఎంతో కొంత నగదును సమకూరుస్తూనే వున్నాయి. అయినప్పటికీ వారి జీవనాధారాలకు అవసరమైన మద్దతు లభించడం లేదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు నగదు పంపిణీ చేయాలి. వారి చేతుల్లో విధిగా కొంత నగదు వుండేలా చర్యలు చేపట్టాలి. దేశంలోని 26 కోట్ల కుటుంబాలలో 50 శాతానికి ఈ నగదు సహాయాన్ని సమకూర్చాలి. ఇంచుమించు 13 కోట్ల కుటుంబాలకు నగదును పంపిణీ చేయవలసివుంటుంది. పట్టణ ప్రాంతాల పేదలకు సంబంధించి ఉజ్వల పథకం లబ్ధిదారుల జాబితాలతో ప్రారంభమవ్వాలిజ జన్‌ధన్ ఖాతాలను పరిశీలనలోకి తీసుకోవాలి జన్‌ఆరోగ్య ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరిన వారిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. దారిద్ర్య రేఖకు దిగువన (బిపిఎల్) కుటుంబాల జాబితాలో ఈ జాబితాలను సరిచూసుకుని, పేద కుటుంబాలకు సంబంధించిన తుది జాబితాను రూపొందించుకునేందుకు రాష్ట్రాలకు అధికారమివ్వాలి. గ్రామీణ పేదల విషయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారుల పట్టీతో ప్రారంభమవ్వాలి. ఉజ్వల పథక లబ్ధిదారుల జాబితాలనూ పరిశీలనలోకి తీసుకోవాలి. బిపిఎల్ జాబితాలతో ఈ జాబితాలను సరిచూసుకుని తుది జాబితాలను సిద్ధం చేసుకునేందుకు రాష్ట్రాలకు అధికారమివ్వాలి. ఆదివాసీ ప్రాంతాలలోని అన్ని కుటుంబాలకు ఈ నగదు సహాయాన్ని అందించాలి.

పద మూడు కోట్ల పేద కుటుంబాలకు సంబంధించి రాష్ట్రాల వారీగా జాబితాలను రూపొందించుకోవడం సాధ్యమేనని నేను భావిస్తున్నాను. లబ్ధిదారుల విషయంలో అవకతవకలు జరిగేందుకు అవకాశం లేకపోలేదు. అయితే కరోనా ప్రస్తుత జాతీయ ఆత్యయిక స్థితిలో ఆ లోపాలు, లొసుగులను ఉపేక్షించవచ్చు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయంతో రాష్ట్ర ప్రపభుత్వాలు పేదకుటుంబాల జాబితాలను ఐదు రోజులలో రూపొందించుకోవచ్చు.

పేద కుటుంబంగా గుర్తించిన ప్రతి కుటుంబపు బ్యాంకు ఖాతాలో మూడు రోజులలోగా మొదటి విడతగా రూ.5000 జమ చేయనున్నట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 14న జాతీయ టెలివిజన్‌లో ప్రకటించాలి. అర్హమైన కుటుంబానికి బ్యాంకు ఖాతా లేనిపక్షంలో ఆ సొమ్మును వారి నివాసానికి తీసుకువెళ్ళి అందజేయాలి. ఈ ఆర్థిక వితరణకు అయ్యే మొత్తం గరిష్ఠంగా రూ.65,000 కోట్ల మేరకు వుంటుంది. పేదలకు ఈ సహాయం సంపూర్ణంగా భరింపదగినది, పరిపూర్ణంగా సాధ్యమైనది, ఆర్థికంగా వివేకవంతమైనది, సామాజికంగా అనివార్యమైనది. ఏప్రిల్ 14 అనంతరం లాక్‌డౌన్‌ను పొడిగించినప్పటికీ తమకు అందిన, అందే నగదు సహాయంతో పేదలు తమ కష్టనష్టాలను తట్టుకోగలరు. ఇక మూడు, నాలుగు అంశాలను చూద్దాం. నేను చెప్పేదేమంటే మొదట చేయవలసిన పనులను మొదటే చేద్దాం. చేయాలికూడా. జాతీయ వనరులపై మొదటి హక్కు పేద ప్రజలదేనని, పేదల సంక్షేమానికే వాటిని ఉపయోగించాలని మనం ఎన్ని మార్లు ఘోషించలేదూ? మరి వాటికి మనం కట్టుబడి వుండొద్దూ?

*(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)*

# శ్రీకాకుళ ఉద్యమ యోధుడు

శ్రీకాకుళ సాయుధ పోరాటయోధుడు, సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నేత వాసుదేవరావు అమరులై పది సంవత్సరాలు గడిచిపోయాయి. 1932 ఆగస్టు 11న శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడు గ్రామంలో పైలా జన్మించారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు సిద్ధాంతం వైపు ఆకర్షితులై 1953లో అప్పటి సి.పి.ఐ.లో సభ్యులైనారు. కొంతకాలం సర్వేయర్‌గా పనిచేసిన తర్వాత పార్టీ పిలుపు మేరకు ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి గ్రామాల్లో యువకులను చైతన్యపరిచి యువజన సంఘ నిర్మాణం చేసారు. 1962లో పార్టీ పిలుపునందుకుని ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి పూర్తికాలపు కార్యకర్తగా బాధ్యత తీసుకుని టెక్కలి ప్రాంతంలో రైతాంగంలో కృషి చేసారు. 1964లో సి.పి.ఐలో చీలిక వచ్చి సి.పి.ఎం ఏర్పడినపుడు ఆ పార్టీలో జిల్లా కమిటీ సభ్యుడైనారు. నిలకడైన కృషితో సాగుతున్న శ్రీకాకుళ రైతాంగ ఉద్యమం 1967 నాటికి ఉప్పెనలా ముందుకు వచ్చింది. అదే సమయంలో వసంతమేఘ గర్జనతో వెల్లువలా విజృంభించిన నక్సల్బరి సాయుధ రైతాంగ ఉద్యమం దీనికి మరింత ప్రేరణ నందించి పైలా లాంటి కామ్రేడ్స్ అసమాన త్యాగాలకు సిద్ధపడడానికి పురికొల్పింది. పార్టీ పిలుపునందుకున్న పైలా 1968 ఫిబ్రవరిలో అజ్ఞాతజీవితంలోకి వెళ్ళి శ్రీకాకుళోద్యమంలో అవిశ్రాంతంగా ఎన్నో కష్టనష్టాలకోర్చి ఆదర్శవంతమైన విప్లవకృషి సాగించారు. వెల్లువెత్తిన విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళకుండా విద్రోహానికి పాల్పడిన సి.పి.ఎం నుండి విప్లవకారులు బయటికి వచ్చారు.



విప్లవకారుల నాయకత్వంలో సాయుధపోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి ఏర్పడిన రాష్ట్ర సమన్వయ కమిటీలో పైలా చురుకైన పాత్ర నిర్వహించారు. శ్రీకాకుళ ఉద్యమప్రాంతమంతటినీ కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి అప్పటి కాంగ్రెసు ప్రభుత్వం తీవ్రనిర్బంధం ప్రయోగించింది. 350 మందికి పైగా విప్లవకారులను ఎన్‌కౌంటర్ల పేరిట కాల్చిచంపారు. 1971 చివరి నాటికి కోరన్న, మంగన్న, పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి, సుబ్బారావు పాణిగ్రాహి, దేవినేని మల్లిఖార్జున్, చాగంటి భాస్కరరావు, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది నిర్మల, అంకమ్మ, సరస్వతి తదితర కామ్రేడ్స్ రాజ్యహింసలో అమరులైనారు. ఉద్యమం కష్టాల్లో వున్న స్థితిలో పైలా విస్తృతంగా ఉద్యమగ్రామాలను పర్యటించి కార్యకర్తకూ, ప్రజలకూ ధైర్యాన్నిచ్చి ఉద్యమాన్ని నిలబెట్టడానికి తీవ్రంగా కృషిచేసారు. అనతికాలంలోనే వర్గశత్రు నిర్మూలనా పంథా ఉద్యమానికి చేసిన నష్టాన్ని గుర్తించిన పైలా ఆ పంథాని వీడి ప్రజా యుద్ధపంథా చేపట్టి విప్లవకారులతో ఐక్యతకు కృషి చేశారు. ఆ తరుణంలో సత్యనారాయణ సింగ్‌చే పునరుద్ధరించబడిన కేంద్ర కమిటీలో సభ్యుడైనారు. తర్వాత చంద్ర పుల్లారెడ్డి నాయకత్వాన గల ఏ.పి.ఆర్.సి.పితో ఐక్యత సాధించి ఒకే పార్టీగా ఏర్పడడానికి తన వంతు పాత్ర నిర్వహించారు. 1976 తర్వాత రామనర్సయ్య మరణానంతరం సి.పి.ఐ(ఎం.ఎల్) రాష్ట్రకమిటీకి కార్యదర్శి అయ్యారు. 1980లో మరోసారి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యి, అఖిల భారత మహాసభలో కేంద్ర కమిటీ సభ్యుడుగా తిరిగి ఎన్నికయ్యారు. పైలా అమరుడయ్యేనాటికి సి.పి.ఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యునిగానూ, వి.వి.యస్ ఏరియా కమిటీ సభ్యుగానూ ఉన్నారు.

శ్రీకాకుళోద్యమాన్ని నిలబెట్టడానికి అవిశ్రాంత కృషిచేసిన పైలా 1972 తర్వాత ప్రజా యుద్ధపంథాలో విప్లవోద్యమ నిర్మాణానికి అసమాన కృషి చేసారు. నాలుగు దశాబ్దాలకుపైగా రహస్య జీవితం గడుపుతూ శత్రు నిర్బంధం మధ్య విప్లవ కృషి సాగిస్తూ రాష్ట్రంలో విప్లవోద్యమం బలపడడానికి తనవంతు పాత్ర నిర్వహించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో రైతుకూలీ ఉద్యమం, కార్మికోద్యమం అభివృద్ధి చెందడంలో ప్రముఖ పాత్ర పోషించారు. నమ్మిన సిద్ధాంతం కోసం, విప్లవోద్యమ నిర్మాణం కోసం తుదిశ్వాస విడిచేవరకూ అత్యంత క్రమశిక్షణతో త్యాగాలు చేసిన పైలా ఎంతో ఆదర్శ నాయకుడు. నేటి విప్లవకారులకు మార్గదర్శి. పైలాకు మా అరుణారుణ జోహార్లు.

**❑ సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ,**
శ్రీకాకుళం పార్వతీపురం ఏరియా కమిటీ

*(నేడు పైలా వాసుదేవరావు పదవ వర్ధంతి)*

## కాంట్రాక్టర్లపై ప్రేమ కర్షకులపై ఏదీ?

రాష్ట్రంలో వ్యవసాయరంగం కోలుకోలేని నష్టాల్లోకి, సంక్షోభంలోకి నెట్టబడింది. ఈ ఏడాది పంటలు బాగానే పండాయి. కానీ, పంటని ఇంటికి చేర్చుకొని, అమ్ముకునే దారి లేదు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై లేదా? లాక్‌డౌన్‌కు తోడు అకాల వర్షాలు రైతాంగాన్ని మరింత దెబ్బతీసాయి. వర్షాల వల్ల కోతకొచ్చిన వరి పైరు నేల పాలైంది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం నీటమునిగింది. కోత కోయాల్సిన మిర్చి పొలంలోనే రాలిపోయింది. ఉడికించిన పసుపు తడిచిపోయింది. పక్వానికి వచ్చిన నిమ్మ, అరటి, తోటలు నేలకొరిగాయి. మామిడి, దానిమ్మ, బొప్పాయి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. లాక్‌డౌన్ మూలంగా ఆదాయం పడిపోయిందని చెప్పి రైతులను ఆదుకునే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పించుకొనే ప్రయత్నం చేయడం మంచిది కాదు. కాంట్రాక్టర్లకు దాదాపు రూ.8000 కోట్ల బిల్లులు చెల్లించినట్లు సమాచారం. ఇలాగే పుట్టెడు కష్టాల్లో వున్న అన్నదాతను కూడా ఆదుకోవాలి.

లాక్‌డౌన్‌తో చేతికొచ్చిన రబీపంటలు నోటి కందకుండా పోతున్నాయని రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఉద్యాన పంటలు కూరగాయలు, పండ్ల రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది. దేశ ఉత్పత్తిలో 15.5 శాతం పండ్లు, 7.9 శాతం కూరగాయలు ఏపీలో పండుతాయి. పండిన పంట పొలాల్లోనే నిలిచిపోయింది. కూలీలు రాకపోవడంతో ఏం చెయ్యాలో రైతులకు దిక్కుతోచడం లేదు. ఆక్వా రంగ పరిస్థితీ ఇంతే.. తలలు తీసి నిల్వ చేసుకుందామంటే ఆక్వా కంపెనీల గిడ్డంగులు మూతపడ్డాయి. ఎకరా, అరెకరా లీజుకు తీసుకుని సాగు చేస్తున్న చిన్న, సన్న కారు రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఈ పరిస్థితుల్లో కాంట్రాక్టర్ల అవసరాలనుబట్టి కాక కర్షకుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని రైతులు పండించిన పంటల మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి కర్షకులను యుద్ధ ప్రాతిపదికపై ఆదుకోవాలి.

**– నీరుకొండ ప్రసాద్**

## వైద్యరంగాన్ని జాతీయం చేయాలి

కరోనా వైరస్ ప్రపంచాన్ని కబళించడానికి ప్రధాన కారణం ప్రపంచీకరణే. ప్రపంచీకరణలో భాగంగా హద్దులు లేని వ్యాపారాలు, వ్యవహారాలు కొనసాగుతున్నాయి, ప్రకృతి విధ్వంసాలూ జరుగుతున్నాయి. ప్రస్తుత వైరస్ వ్యాప్తి వీటిలో భాగమే. దానికి తోడు వైద్య రంగం కార్పొరేటీకరణ చెంది ప్రజారోగ్యం ప్రశ్నార్థకమైనందునే అగ్రరాజ్యాలు సైతం విపత్తును ఎదుర్కోలేకపోతున్నాయి. చైనా, రష్యా, క్యూబా, దక్షిణ కొరియా దేశాల్లో వైద్యం పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉన్నందున అక్కడ కొవిడ్ 19ను నియంత్రించగలుగుతున్నారు. అమెరికా, ఇటలీ, స్పెయిన్లలో వైద్యం ప్రైవేట్ యాజమాన్యంలో ఉంది. కొన్ని దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కింద ఉన్నా, ప్రైవేటు, కార్పొరేట్లదే ఆధిపత్యం.

మన దేశంలో మెజారిటీ వైద్యరంగం ప్రైవేటు చేతిలో ఉన్నది. ప్రభుత్వ హాస్పిటల్స్‌ను నిర్లక్ష్యం చేసి, సరైన నిధులు, నియామకాలు, వసతులు కల్పించకుండా పరోక్షంగా ప్రైవేట్ వైద్యాన్ని ప్రోత్సహించాం. ఆపత్కాలంలో అది మనలను ఆదుకోలేకపోతున్నది.

క్యూబాలో సగటున 25 మందికి ఒక డాక్టర్ ఉండగా, యూరోప్, అమెరికా, తదితర అభివృద్ధి చెందిన దేశాలలో సగటున 50 మందికి ఒక డాక్టర్ దాదాపు అదే నిష్పత్తిలో హాస్పిటల్స్, బెడ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. మన దేశంలో ప్రతి 1000 మంది జనాభాకి కూడా ఒక వైద్యుడు లేని పరిస్థితి. ప్రస్తుత పరిస్థితిలో ప్రజల ప్రాణాలను కాపాడుకోవడమే ప్రధాన ఎజెండాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ అమలు చేస్తున్నాయి. దీనికి తోడు ప్రజలకు వైద్య సదుపాయం కూడా వెంటనే లభిస్తే ప్రాణనష్టం లేకుండా చేయగలం. అందుకని, దేశంలో ఉన్న అన్ని కార్పొరేట్ హాస్పిటళ్ళు, వైద్య కళాశాలలను జాతీయం చేస్తే సత్వర వైద్యం అందించి కరోనా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించగలం. కనీసం, ప్రస్తుత ఉపద్రవం నుండి దేశం విముక్తి పొందే వరకైనా ప్రైవేట్ రంగంలోని అన్ని రకాలైన వైద్య వ్యవస్థలను జాతీయం చేయడం ఉత్తమ చర్య. గతంలో ఇందిరా గాంధీ సాహసోపేతంగా వ్యవహరించి బ్యాంకులను జాతీయం చేసి ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారు. మన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కూడా వైద్య, విద్యా రంగాలు ప్రభుత్వాధీనంలో ఉండాలని ప్రతిపాదించారు. అందుకని, వైద్య రంగాన్ని జాతీయం చేస్తే ప్రస్తుత సంక్షోభాన్నే కాదు, భావి ఆరోగ్య విపత్తులనూ ఎదుర్కోగలం.

**– పి. రమేష్ చందర్**

# ట్రంప్ మళ్ళీ గెలిస్తే...



■ రామచంద్ర గుహ

గతానుగతం

బ్రిటిష్‌వారు సుదీర్ఘకాలం నుంచి ఎన్నికలు నిర్వహిస్తున్నారు; భారతీయులు అత్యధిక సంఖ్యలో ఓటు వేస్తారు. అయితే అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నికలలో ప్రజాస్వామికంగా ఓటుహక్కును వినియోగించుకునే ప్రక్రియ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ప్రభావశీలంగా చోటుచోటుచేసుకోవడం కద్దు. బహుశా, ఇది ఒక శతాబ్దానికి పైగా జరుగుతున్నది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న, శక్తిమంతమైన దేశమయినందున అమెరికాకు ఎవరు నాయకత్వం వహిస్తున్నారనేది మానవాళిని విశేషంగా ప్రభావితంచేసే అంశంగా వున్నది. బోరిస్ జాన్సన్ (బ్రిటిష్ ప్రధాని) విధానాల ప్రభావం ఐరోపా వెలుపల ఏమీ వుండదు. దక్షిణాసియా వెలుపల నరేంద్ర మోదీ విధానాలకు ఎలాంటి ప్రాధాన్యముండదు. అయితే అమెరికా అధ్యక్షుడు ఏమి చేస్తున్నారు, ఏమి చేయడం లేదనేది సమస్త విశ్వాన్ని ప్రభావితం చేస్తుంది. 2000 సంవత్సరం అమెరికా అధ్యక్ష ఎన్నికలలో జార్జి బుష్ బదులు అల్ గోర్ ఎన్నికయి వుంటే ఇరాక్ యుద్ధం ఖచ్చితంగా జరిగివుండేది కాదు. ప్రపంచం ఇప్పుడు మరింత భద్రంగా వుండేది.

2020 అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నికలు మామూలుగానే ప్రపంచానికి ఎంతో కీలకమైనవి. అందునా కొవిడ్ 19 విజృంభణతో అవి మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ అధ్యక్షుడు అవడం అమెరికాకు శ్రేయస్కరమేనా అనే విషయాన్ని అమెరికా ప్రజలే నిర్ధారించవలసివున్నది. అయితే ట్రంప్ మళ్ళీ అధ్యక్షుడవడమనేది ప్రపంచానికి హానికరమనడంలో సందేహం లేదు. పారిస్ ఒడంబడిక నుంచి అమెరికా వైదొలగాలన్న ఆయన నిర్ణయంతో వాతావరణ మార్పుల ముప్పు మరింత తీవ్రమయింది. ఇరాన్‌పై మళ్ళీ ఆంక్షలు విధించడం వల్ల పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత అస్థిరమయ్యాయి. ట్రంప్ విధానాల వల్లే శరణార్థుల సంక్షోభం మరింతగా విషమించింది. ఆసియా, ఆఫ్రికా ప్రజల విషయంలో ఆయన ఉపయోగించే మొరటు, జాత్యహంకార భాష అమెరికాకు గానీ, ప్రపంచానికి గానీ ఏమాత్రం మేలు చేసేది కాదు.

2017 జనవరిలో కంటే ప్రపంచం ఇప్పుడు తక్కువ సురక్షితంగానూ, మరింత అసంతృప్తితోను వున్నది. ఈ పరిస్థితికి దారి తీసిన కారణాలు చాలా వున్నాయనడంలో సందేహం లేదు. అయితే ట్రంప్ పాలనా శైలి, ఆయన విధానాలు వాటిలో చాలా ప్రధానమైనవని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ కారణంగానే అమెరికా పౌరులు కాని అసంఖ్యాక ప్రజలు అమెరికా అధ్యక్ష ఎన్నికల పూర్వరంగాన్ని ఆసక్తితోను, ఆందోళనతోను గమనిస్తున్నారు. ప్రపంచం మరింత సురక్షితంగానూ, మరింత సంతృప్తితోను ఉండే అవకాశాలు ట్రంప్ ఓటమిలో కంటే గెలుపులో చాలా తక్కువగా వుంటాయి.

గత ఫిబ్రవరిలో నేను అమెరికాలో వున్నాను. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి పోటీపడుతున్న వారి మధ్య చర్చలను నిశితంగా గమనించాను. ఆ దశలో వెర్మాంట్ సెనేటర్ బెర్నీ శాండర్స్ ఆ పోటీలో అగ్రగామిగా వున్నారు. ట్రంప్ విధానాలను వ్యతిరేకించే, ఆయన వ్యవహారశైలిని అసహ్యించుకునే నా అమెరికన్ స్నేహితులలో కొంతమంది, శాండర్స్ మాత్రమే ప్రస్తుత అధ్యక్షుడిని ఓడించేలా డెమొక్రాటిక్ ఓటర్లను పురిగొల్పగల సమర్థుడని భావిస్తున్నారు. శ్వేతజాతి కార్మికులలోను, యువ అమెరికన్లలోను శాండర్స్‌కు గట్టి మద్దతు వున్నందునే ఆయనపై వారు ఆశలు పెట్టుకున్నారు. అయితే శాండర్స్ సంపూర్ణ వామపక్షవాది గనుక ట్రంప్‌ను ఓడించలేడని మరికొంత మంది వాదించారు. మార్చి తొలినాళ్ళలో న్యూయార్క్ నుంచి నేను నిష్క్రమించే నాటికి శాండర్స్ కంటే జో బిడెన్ ముదంజలో వున్నారు. చివరకు, నా అమెరికన్ స్నేహితులు కొంత మంది భయపడినట్టు పోటీ నుంచి శాండర్స్ విరమించుకున్నారు. శ్వేతజాతి ఓటర్లలో ఒక వర్గం వారు జో బిడెన్‌కు మద్దతునివ్వగలరని, పైగా బరాక్ ఒబామా హయాంలో ఉపాధ్యక్షుడుగా ఉన్నందున ఆఫ్రికన్ అమెరికన్లు గణనీయంగా ఆయనకే ఓటు వేసే అవకాశముందని నా అమెరికన్ స్నేహితులు పలువురు విశ్వసిస్తున్నారు. అయితే బిడెన్ వృద్ధుడు కావడంతో పాటు, ఆయన కుమారుడి వివాదాస్పద వ్యాపార లావాదేవీల మూలంగా ట్రంప్‌ను ఆయన ఓడించలేడని కూడా కొంతమంది భావిస్తున్నారు.

అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నిక సాధారణంగా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక, ప్రభావ శీల ప్రజాస్వామిక అభ్యాసం. అమెరికన్ పౌరులు మాత్రమే ఓటు వేస్తున్నప్పటికీ , ఆ ఎన్నిక ఫలితాలు అమెరికా పౌరులు కాని అసంఖ్యాక మానవుల భవిష్యత్తును నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తాయి. ఈ దృష్ట్యా , 2020 అమెరికా అధ్యక్ష ఎన్నిక ఇంతకు పూర్వపు అధ్యక్ష ఎన్నికల కంటే చాలా ముఖ్యమైనది.

అమెరికాలో కొవిడ్ 19 ప్రబలడంపై ఇప్పటికే పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కరోనా వైరస్ విషయమై ట్రంప్ తొలుత చాలా తీవ్రంగా ప్రతిస్పందించారు. దాని వల్ల అమెరికా ప్రజలకు ముప్పు ముంచుకురాబోతుందన్న హెచ్చరికలను తిరస్కరించారు. ఆ వైరస్‌ను అరికట్టడానికి తన ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందని (ఇందులో నిజం లేదు) ట్రంప్ చెప్పారు. కరోనా కేసుల సంఖ్య ఆకస్మికంగా పెరగడంతో ట్రంప్ ఎట్టకేలకు రంగంలోకి దిగాడు. అయితే అప్పటికే ఆలస్యమైపోయింది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించేందుకు, ఆర్జిత అత్యవసర సెలవులు ఇచ్చేందుకు అవసరమైన ఆర్థికసహాయాన్ని సమకూర్చేందుకు ఉద్దేశించిన ఒక శాసనానికి కాంగ్రెస్ ఆమోదాన్ని పొందారు. కరోనా కట్టడికై సంబంధిత అధికారులు, నిపుణులతో నిత్యం సంప్రదింపులు జరపడం ప్రారంభించారు. ఇదే సమయంలో కరోనాను 'చైనీస్ వైరస్' అని జాత్యహంకార ధోరణితో ట్రంప్ ప్రస్తావించసాగారు. అయితే తన సలహాదారుల సూచనపై చైనాపై విమర్శలను విరమించాడు. కరోనా వ్యాప్తి విషయమై ప్రపంచ ఆరోగ్య సంస్థ తక్కువ అంచనా వేసిందని, తత్ఫలితంగానే తాము సకాలంలో కట్టడి చర్యలు చేపట్టలేకపోయామని ట్రంప్ చెప్పాడు. నిజానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ తదితర ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల పట్ల ట్రంప్ మొదటి నుంచీ తిరస్కార పూరిత వైఖరితో వ్యవహరిస్తూ వస్తున్నాడు. గతంలో ఆ సంస్థ సలహాలను చులకన చేశాడు. చివరకు అమెరికా తరఫున ఇవ్వాల్సిన నిధులను సైతం నిలిపివేశాడు. మరోముఖ్యమైన విషయమేమిటంటే గత జనవరి చివరి రోజులలోనే ట్రంప్ సొంత వాణిజ్య సలహాదారు పీటర్ నవారో కరోనా వైరస్ అమెరికా ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేయనున్నదని హెచ్చరించాడు. సరైన వ్యాక్సీన్ లేకపోవడం వల్ల లక్షలాది అమెరికన్ల ప్రాణాలను హరించివేయగలదని స్పష్టం చేశాడు.

ట్రంప్ మళ్ళీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు కొవిడ్ 19 ఆటంకమవుతుందా లేక దోహదం చేస్తుందా అనే విషయమై ప్రస్తుత దశలో ఎవరూ ఏమీ చెప్పలేరు. ఆయన అస్థిర వ్యక్తిత్వం అమెరికా అధ్యక్ష పదవికి ఏ మాత్రం వన్నె తెచ్చేది కాదు. ఈ సంక్షోభ పర్యవసానాల కారణంగా ఓటర్లు జో బిడెన్ వైపు మొగ్గు చూపే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. అయితే కరోనా వైరస్‌ను అమెరికా తీరానికి 'శత్రువు' తీసుకొచ్చాడని ఆక్రోశిస్తూ ఓటర్లను ట్రంప్ తన వైపుకు తిప్పుకునే అవకాశమూ వున్నది. జెనోఫోబిక్ (విదేశీయుల మీద వైముఖ్యత) భయాలను రెచ్చగొట్టడంద్వారా 2016 ఎన్నికలలో ట్రంప్ విజయం సాధించగలిగారు. మన ప్రధానమంత్రి యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా 2019 ఎన్నికలలో విజయం సాధించిన రీతిలో 2020 ఎన్నికలలో విజయానికి ట్రంప్ ప్రయత్నించవచ్చునని పలువురు భావిస్తున్నారు. జాతీయ సంక్షోభాల సమయంలో దేశ పౌరులు అధికారంలో ఎవరు వున్నప్పటికీ వారినే తప్పక సమర్థిస్తారనే అభిప్రాయం ఒకటి వున్నది. ఈ కారణంగా బ్రిటన్‌లో బోరిస్ జాన్సన్‌కు, భారత్‌లో నరేంద్ర మోదీకి, అమెరికాలో డోనాల్డ్ ట్రంప్‌కు అధికార గండం వుండదని భావిస్తున్నారు.

2016లో అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నిక, ప్రపంచానికి దుర్వార్త అయితే 2020లో ఆయన మళ్ళీ విజయం సాధించడం మానవాళికి మరింత ఘోరమైన దుర్వార్తే కాగలదు. వాతావరణ మార్పుల వల్ల మానవాళికి ఎదురవుతున్న సవాళ్లు మరింతగా విషమిస్తాయి. పశ్చిమాసియాలో అంతర్యుద్ధాలు మరింత తీవ్రమవుతాయి. అమెరికా, చైనాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించే అవకాశమున్నది. అమెరికా, ఐరోపాల మధ్య సంబంధాలు కూడా తీవ్ర చిక్కుల్లో పడతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మొదలైన ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు మరింతగా బలహీనపడతాయి.

కొవిడ్ 19 ప్రబలిపోతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్ష ఎన్నికలలో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థే విజయం సాధించాలన్న ఆకాంక్ష అమెరికాయేతర ప్రపంచ ప్రజలలో మరింతగా బలీయమవుతోంది. కరోనా వైరస్ మూలంగా మానవాళి ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా చెల్లించుకుంటున్న మూల్యాలు అపరిమితమైనవి. ఇరవయో శతాబ్దిలో రెండు ప్రపంచ యుద్ధాలతో వాటిల్లిన అపారనష్టాలతో వాటిని పోల్చవచ్చు. కొవిడ్ 19 ముప్పు నుంచి మానవాళి సంపూర్ణంగా బయటపడినప్పుడు ప్రపంచాన్ని యథాపూర్వస్థితికి తీసుకురావడానికి అసాధారణ శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు, సహానుభూతి ఎంతైనా అవసరమవుతాయి. ప్రపంచ అగ్రరాజ్యాలు మున్నెన్నడూలేని విధంగా మరింత సమన్వయ సహకారాలతో కృషి చేయవలసివుంటుంది. ఈ ధరిత్రిపై అత్యంత శక్తిమంతమైన దేశమైన అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ ఎన్నికయితే ఆయన మొండివైఖరి, వివేకరహిత విధానాలు దేశాల మధ్య నిర్మాణాత్మక సహకారానికి దోహదం చేయవు. కరోనా విధ్వంసం నుంచి కోలుకోవడానికి ప్రపంచానికి ఏవైతే దేశాలు, జాతులు, సమాజాల మధ్య సహాయ సహకారాలుఅత్యవసరమో అవే కొరవడతాయి.

అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నిక సాధారణంగా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక, ప్రభావ శీల ప్రజాస్వామిక అభ్యాసం. అమెరికన్ పౌరులు మాత్రమే ఓటు వేస్తున్నప్పటికీ, ఆ ఎన్నిక ఫలితాలు అమెరికా పౌరులు కాని అసంఖ్యాక మానవుల భవిష్యత్తును నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తాయి. ఈ దృష్ట్యా, 2020 అమెరికా అధ్యక్ష ఎన్నిక ఇంతకు పూర్వపు అధ్యక్ష ఎన్నికల కంటే కూడా చాలా ముఖ్యమైనది.

*(వ్యాసకర్త చరిత్రకారుడు)*



స్ఫూర్తి

# వారి సేవలకు సలామ్!

**కరోనా మహమ్మారిని దేశం నుంచి పారద్రోలేందుకు ఎంతోమంది మహిళా డాక్టర్లు, సైంటిస్టులతో పాటు కొందరు ఐఏఎస్ అధికారులు కూడా నిద్రాహారాలు మాని నిరంతరాయంగా పనిచేస్తున్నారు. కరోనాను కట్టడి చేసేందుకు డయాగ్నోసిస్, ప్రివెన్షన్, రీసెర్చ్, క్యూర్ విభాగాలతో పాటు అడ్మినిస్ట్రేషన్‌లో కూడా చురుగ్గా పాల్గొంటూ... ప్రముఖ పాత్ర పోషిస్తున్న ఐదుగురు మహిళలపై 'ఫోకస్' ఇది.**


రేణూ స్వరూప్


బీలా రాజేశ్


నివేదితా గుప్తా


ప్రియా అబ్రహాం

### ప్రీతీ సుడాన్
**(కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శి)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ (1983 బ్యాచ్)అధికారిణి ప్రీతీ సుడాన్. ప్రస్తుతం న్యూఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రీతి కరోనాపై చేస్తున్న పోరాటంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమె తన ఆఫీసు 'నిర్మాణ్ భవన్'లో 24 గంటలు పనిచేస్తున్నారు. 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'లో 'సోషల్ పాలసీ అండ్ ప్లానింగ్'లో పీజీ చేసిన ప్రీతి ఆ తర్వాత ఎంఫిల్ కూడా పూర్తి చేశారు. వాషింగ్టన్‌లోని ప్రసిద్ధ వరల్డ్‌బ్యాంక్‌కు కన్సల్టెంట్‌గా కొంతకాలం సేవలందించారు. ఆ తర్వాత కేంద్ర సర్వీసుల్లో చేరారు. కరోనా మహమ్మారి కట్టడిలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖదే కీలక బాధ్యత. కేంద్ర ఆరోగ్యమంత్రి హర్షవర్ధన్‌తో కలసి ఎప్పటికప్పుడు ప్రణాళికలు రచిస్తూ... అటు కేంద్రంలోని, ఇటు ఆయా రాష్ట్రాల్లోని వివిధ డిపార్ట్‌మెంట్‌లకు సూచనలు ఇవ్వడంలో ప్రీతి బిజీగా ఉంటున్నారు. "దేశవ్యాప్తంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆమె ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్యాలయానికి కరోనా విషయంలో ఎలాంటి సమాచారం కావాలన్నా ఇస్తుంటారు" అని మంత్రిత్వశాఖలోని ఒక సీనియర్ అధికారి చెబుతున్నారు. కొవిడ్ 19కు చిరునామాగా ఉన్న చైనాలోని వూహాన్ నుంచి మన దేశానికి చెందిన 645 విద్యార్థులను ఇక్కడికి తీసుకురావడంలో కూడా ప్రీతి పాత్ర ఉంది.

❖ ❖ ❖


ప్రీతీ సుడాన్

### డాక్టర్ నివేదితా గుప్తా
**(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సీనియర్ సైంటిస్ట్)**

కేరళలో గత ఏడాది విజృంభించిన 'నిఫా' వైరస్‌ను ఇన్వెస్టిగేట్ చేసిన శాస్త్రవేత్తగా డాక్టర్ నివేదిత గుప్తాకు పేరుంది. 'ఐసీఎంఆర్'లో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న నివేదిత ప్రాథమిక బాధ్యతలు ఏమిటంటే... మనదేశంలో కరోనా వ్యాప్తి చెందకుండా పరీక్షలు, చికిత్సలకు సంబంధించిన ప్రోటోకాల్స్ చూడటం. న్యూఢిల్లీలోని 'లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్'లో ఎంబీబీఎస్ చేసిన డాక్టర్ నివేదిత ఈ రెండు నెలల కాలంలో కరోనా వైరస్ కేసుల కోసం దేశవ్యాప్తంగా 130 ప్రభుత్వ ల్యాబరేటరీలు, 52 ప్రైవేట్ ల్యాబ్‌లు సిద్ధం చేశారు. 'మాలిక్యులర్ మెడిసిన్'లో పీహెచ్‌డీ (జెఎన్‌టీయూ) చేసిన నివేదిత 'ఐసీఎంఆర్'లో వైరస్ పరిశోధనల కోసం ల్యాబరేటరీల నెట్‌వర్క్ (వీఆర్‌డీఎల్) ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ నెట్‌వర్క్‌కు చెందిన 106 లాబోరేటరీలు దేశవ్యాప్తంగా వెలుగుచూసే పలు వైరస్‌లను కనిపెడుతూ మన దేశానికి బాసటగా నిలుస్తున్నాయి. గతంలో డెంగ్యూ, చికున్‌గున్యా, జీకా వంటి వైరస్‌ల ప్రవేశాన్ని తెలిపి వైద్యబృందాలను అప్రమత్తం చేయడంలో నివేదిత కృషి ఎంతో ఉంది.

❖ ❖ ❖

### రేణూ స్వరూప్
**(డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ కార్యదర్శి)**

ఒక సైంటిస్ట్‌గా సైన్స్ అండ్ టెక్నాలజీకి అనుబంధంగా ఉండే 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ' (డీబీటీ)లో విశేష సేవలు అందించిన రికార్డు రేణూ స్వరూప్‌కు ఉంది. 2018 ఏప్రిల్ వరకు ఆమె డీబీటీలో ఔట్‌స్టాండింగ్ సైంటిస్ట్‌గా ఉన్నారు. ఆ తర్వాత డాక్టర్ రేణు అదే డిపార్ట్‌మెంట్‌కు కార్యదర్శి అయ్యారు. దేశంలో బయోటెక్నాలజీ అభివృద్ధిలో ఆమె కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం కరోనా వైరస్ నిరోధానికి అవసరమైన వ్యాక్సిన్ అభివృద్ధి పరిశోధనల్లో పాల్గొంటున్నారు. 'కొవిడ్ 19'కు సంబంధించి తక్కువ ధరలకు అందుబాటులో ఉండే టెస్టింగ్ కిట్లు, వెంటిలేటర్లను ఉత్పత్తి చేసే స్టార్టప్స్‌కు దిశానిర్దేశనం చేస్తున్నారు. ఇప్పటికే 'సైన్స్ అండ్ టెక్నాలజీ' మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీ ఇంక్యుబేటర్లను పోర్టబుల్ వెంటిలేటర్లు, కరోనాను గుర్తించే సరికొత్త విధానాలపై పరిశోధనలు చేయాల్సిందిగా కోరింది.

జెనెటిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన డాక్టర్ రేణు 'విమెన్ ఇన్ సైన్స్'లో కృషి చేస్తున్నారు. ప్రధానికి చెందిన 'సైంటిఫిక్ అడ్వయిజరీ కమిటీ'కి అనుబంధంగా ఉండే ఈ విభాగంలో టాస్క్‌ఫోర్స్ సభ్యురాలిగా ఉండి మహిళలు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకునేలా పలు కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

❖ ❖ ❖

### ప్రియా అబ్రహాం
**(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్)**

ప్రస్తుత కల్లోల సమయంలో అందరి దృష్టి ఒకే వైపు ఉంది. అది పుణేలోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' (ఎన్ఐవీ). మన దేశంలో 'కొవిడ్ 19'ను టెస్ట్ చేసే ఒకే ఒక్క సెంటర్ ఇది (కరోనా వ్యాప్తి నేపథ్యంలో 'ఐసీఎంఆర్' ఇంకొన్ని ల్యాబ్‌లను ఏర్పాటుచేసింది). గతంలో కొవిడ్-19 శాంపిల్స్‌ను పరీక్షించడానికి 12 నుంచి 14 గంటల సమయం పడితే, ప్రస్తుతం ఆ సమయాన్ని 4 గంటలకు తగ్గించారు. ప్రియా అబ్రహాం నేతృత్వంలో 'ఎన్ఐవీ' బృందం కొవిడ్ 19 శాంపిల్స్‌ను అహోరాత్రులు పరీక్షిస్తోంది. వెల్లూరులోని 'క్రిస్టియన్ మెడికల్ కాలేజీ'లో మెడికల్ మైక్రో బయాలజీలో ఎండీ, ఆ తర్వాత పీహెచ్‌డీ చేసిన ప్రియ... ఆ తర్వాత అదే కాలేజీలో క్లినికల్ వైరాలజీ హెడ్‌గా పనిచేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆహ్వానం మేరకు వైరాలజీలో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (డీఎం)కు సిలబస్ రాశారు. హెపటైటిస్, హెచ్ఐవీలపై ఆమె ఎన్నో పరిశోధనలు చేశారు. ఈ అంశంలో ప్రపంచ ఆరోగ్య సంస్థకు గైడ్‌లైన్స్ అభివృద్ధి చేసి ఇచ్చారు. మయన్మార్‌లో జాతీయ హెపటైటిస్ టెస్టింగ్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ తరపున కన్సల్టెంట్‌గా కూడా వ్యవహరించారు.

❖ ❖ ❖

### బీలా రాజేశ్
**(తమిళనాడు ఆరోగ్య కార్యదర్శి)**

కరోనా వైరస్ వ్యాప్తిలో తమిళనాడు మొదటి వరుసలో ఉంది. అయితే తమకు ఎదురైన ఛాలెంజ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్నిరకాలుగా కృషి చేస్తున్నారు తమిళనాడు ఆరోగ్య కార్యదర్శి బీలా రాజేశ్. 1997 బ్యాచ్‌కు చెందిన ఈ ఐఏఎస్ అధికారిణి ట్విట్టర్‌లో చురుగ్గా ఉంటారు. 'వైరస్ ఎవరినైనా ఎటాక్ చేస్తుంది. అందుకే ఒకరిపట్ల మరొకరు బాధ్యతగా ఉంటూనే, కలసికట్టుగా కొవిడ్ 19పై పోరాటం చేయాలి' అంటూ కరోనా మహమ్మారిపై అవగాహన కల్పిస్తూ ఇటీవల ట్వీట్ చేశారామె. మద్రాస్ మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పట్టా తీసుకున్న బీలా ఆ తర్వాత సివిల్ సర్వీసెస్‌లోకి ప్రవేశించారు. కెరీర్ ప్రారంభంలో చెంగల్‌పట్టు సబ్ కలెక్టర్‌గా పనిచేసి, ఆ తర్వాత ఫిషరీస్, తమిళనాడు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కమిషనర్‌గా ఉన్నారు. గత ఏడాది బీలా తమిళనాడు ఆరోగ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 'నీతి ఆయోగ్' ఆరోగ్య సూచీలో తమిళనాడును మూడో స్థానంలో నిలబెట్టారు. ఆరోగ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారామె. తాజాగా కరోనాపై నిరంతరం పోరాటం చేస్తూ, మరింత వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

వినూత్నం



## పార్టీల ఆహార పోట్లాట!

లాక్‌డౌన్ నేపథ్యంలో దేశంలో కొన్నిచోట్ల దాతలు ఉచితంగా పంచే ఆహార పొట్లాల కోసం ప్రజలు పోట్లాడుకుంటున్నారు. కానీ ఉత్తరాఖండ్‌లో మాత్రం ఆహార పొట్లాలు పంచేందుకు బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీగా పనిచేస్తున్నారు. అక్కడ కార్యకర్తల్లో తమ నేతలపై అభిమానమూ కరోనా కేసుల్లా అంతకంతకూ పెరుగుతోంది. అయితే ఆ అభిమానంతో సామాన్య ప్రజలకు మంచే జరుగుతోంది. రాజకీయ పార్టీల కార్యకర్తలు కూడా వంటావార్పు చేసి నిరాశ్రయులకు, కూలీలకు పేద ప్రజలకు అన్నదానం చేస్తున్నారు.


బీజేపీ కార్యకర్తలు 'మోదీ కిచెన్' పేరుతో, కాంగ్రెస్ కార్యకర్తలు 'సోనియా కిచెన్' పేరుతో పోటాపోటీగా పేద ప్రజలకు ఆహారపొట్లాలు పంచుతున్నారు. మార్చి 31న ముస్సోరీలోని కుల్డీ పార్కింగ్ ఏరియాలో 'మోదీ కిచెన్' ప్రారంభమైంది. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే గణేశ్ జోషీ దీన్ని ప్రారంభించారు. త్వరలో ఇలాంటివే మరో మూడు 'మోదీ కిచెన్లు' ఏర్పాటు చేయబోతున్నారట!

కాంగ్రెస్ ఆలస్యంగానే అయినా 'సోనియా కిచెన్' పేరుతో ఆహార పొట్లాల పంపిణీకి దిగింది. అవసరమైనవారు తమను సంప్రతించేందుకు ఫోన్ నెంబర్ కూడా ఏర్పాటు చేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో తమకు అందింది తింటూ, 'ఇదో కొత్త రకం ఆహార పోట్లాట' అనుకుంటున్నారు జనం.

ఇలా చేద్దాం!

**కరోనా దెబ్బతో ప్రపంచమంతా మాస్కు కట్టుకుంటోంది. కరోనా వ్యాధి లక్షణాలు ఉన్నా, లేకున్నా సరే వీధిలోకి వచ్చే అందరూ మాస్కులు వేసుకోవడం శ్రేయస్కరమని ఇప్పుడు నిపుణులు అంటున్నారు. అయితే, సర్జికల్ మాస్కులతో పని లేదనీ, హాయిగా ఇంట్లో చేసుకున్న కాటన్ గుడ్డ మాస్కులైనా వ్యాధి సోకకుండా ముందుజాగ్రత్తగా బాగా పని చేస్తాయనీ తేల్చారు. ఇప్పటికే మన దేశంలోని వివిధ రాష్ట్రాలు మాస్కు తప్పనిసరి అనే నిబంధన కొత్తగా విధించిన నేపథ్యంలో ఇంట్లోనే కర్చీఫ్‌తో కరోనా మాస్క్ ఎలా చేసుకోవాలో చూద్దాం...**

## కర్చీఫ్‌తో కరోనా మాస్క్!




### మాస్కుల వాడకంపై ఆరోగ్య నిపుణుల సూచనలు



- సబ్బు, నీళ్లు, ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్లతో తరచూ చేతులు శుభ్రంగా కడుక్కుంటేనే మాస్కులు ధరించిన ప్రయోజనం నెరవేరుతుంది.
- మాస్కులు ఎలా ధరించాలి, వాడిన తరువాత వాటిని ఎలా నిర్వీర్యం చేయాలో ముందుగానే అవగాహన చేసుకోవాలి.
- మాస్క్ పై భాగంలో ఉండే స్ట్రిప్ ముక్కును పూర్తిగా కప్పు తూ పైకి ఉండాలి. కింద స్ట్రిప్ గడ్డం కిందదాకా ఉండాలి. అప్పు డే ముక్కు, నోరు భాగాలను మాస్క్ పూర్తిగా కవర్ చేస్తుంది.

టెక్ గురు

## కరోనా లింకులతో జర జాగ్రత్త!

**కరోనా భయాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇ-మెయిల్ ద్వారా ఫిషింగ్ లింకులు పంపిస్తూ ఖాతాలు కొల్లగొడుతున్నారు. లాక్‌డౌన్ సమయంలో ఎక్కువ మంది ఫోన్, కంప్యూటర్ మీద గడుపుతుండటంతో సైబర్ నేరగాళ్ల పని సులువవుతోంది. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ఉండాలంటే ఆ నేరాల గురించి తెలుసుకొని ఉండాలి.**




రిలయన్స్ జియో సంస్థ రోజుకి 25 జిబి మొబైల్ డేటా, ఆరు నెలలపాటు ఉచిత ఫోన్‌కాల్స్‌ను అందిస్తోంది. అలాగే 498 రూపాయల విలువైన ఉచిత రీఛార్జ్‌ను జియో అందిస్తోంది. ఆఫర్‌ను యాక్టివేట్ చేసుకోవాలంటే ఈ లింక్ క్లిక్ చేయండి అంటూ ఒక మెసేజ్ వాట్సాప్‌లో సర్క్యులేట్ అవుతోంది. ఎట్టి పరిస్థితుల్లో దాన్ని క్లిక్ చేయకండి. పొరపాటున క్లిక్ చేస్తే, 'ప్రైమ్ ఆఫర్స్.ఏపికె' పేరుతో ఒక ఆండ్రాయిడ్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొమ్మని సందేశం వస్తుంది. దాన్ని ఇన్‌స్టాల్ చేస్తే మీ ఫోన్ పూర్తిగా హ్యాకర్ కంట్రోల్‌లోకి వెళుతుంది. మీకు తెలియకుండానే మీ ఫోన్‌లో ఫోటోలు, వీడియోలు చూడడంతో పాటు, మీరు ఎవరితో మాట్లాడుతున్నారు, ఎప్పటికప్పుడు మీ లొకేషన్, మైక్రోఫోన్ యాక్సెస్ వంటివన్నీ హ్యాకర్ నియంత్రణలోకి వెళ్తాయి. రిలయన్స్ జియో సంస్థ నిజంగా అలాంటి ఆఫర్ ఏదైనా అందిస్తే, అధికారికంగా తన 'మై జియో' యాప్‌లో తెలియజేస్తుంది.

**ఈఎంఐల గురించి ఫోన్ కాల్ వచ్చిందా?**

బ్యాంకుల నుంచి వివిధ రకాల లోన్లు తీసుకున్న వారికి, క్రెడిట్ కార్డు కలిగి ఉన్నవారికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం మూడు నెలలపాటు వాయిదాలు చెల్లించే అవసరం లేదని ప్రకటించింది. సరిగ్గా దీన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు వల పన్నుతున్నారు. బ్యాంకు ప్రతినిధులుగా ఫోన్లు చేస్తున్నారు. మీకు నమ్మకం కలగడం కోసం గతంలో వివిధ పద్ధతుల ద్వారా సేకరించిన మీ బ్యాంకు ఖాతా లేదా మీ క్రెడిట్ కార్డ్ వివరాలను చెబుతారు. ఈఎంఐ వాయిదా వేయాలంటే యాక్టివేట్ చేసుకోవాలి అని కబుర్లు చెబుతారు. అప్పటికే తన దగ్గర మీ బ్యాంక్ అకౌంట్‌కు సంబంధించి ఉన్న వివరాల ద్వారా మీ అకౌంట్లో నుంచి డబ్బులు కాజేయడానికి ఫ్రాడ్ లావాదేవీ మొదలుపెట్టి, 'మీకు ఇప్పుడు ఒక ఓటిపి వస్తుంది'. దానిని తెలియజేయండి అంటాడు. ఈఎంఐ గురించి ఆలోచిస్తున్న మీరు ఏ మాత్రం రెండో ఆలోచన లేకుండా అతను కోరినట్లు ఓటీపి చెబుతారు. అంతే క్షణాల్లో, మీ అకౌంట్లో నుంచి భారీ మొత్తంలో డబ్బులు మాయమవుతాయి.

**నెట్‌ఫ్లిక్స్ ఉచితమా?**

నెట్‌ఫ్లిక్స్ పేరుతో మరో అసత్య ప్రచారం జరుగుతోంది. సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉంటున్న వారి కోసం నెట్‌ఫ్లిక్స్ కొన్ని ఉచిత పాసులు అందిస్తున్నట్లుగా హ్యాకర్లు నమ్మిస్తున్నారు. చాలామంది తెలిసీ తెలియక అమాయకంగా ఇలాంటి లింకులు క్లిక్ చేస్తున్నారు. ఇది పూర్తిగా ప్రమాదకరమైన మెసేజ్. దీన్ని క్లిక్ చేస్తే మరో పది మందికి షేర్ చెయ్యమనీ, ఆ తర్వాత మీ నెట్‌ఫ్లిక్స్ అకౌంట్‌లోకి లాగిన్ అయితే ఆఫర్ యాక్టివేట్ అవుతుందని చూపిస్తుంది. ఒకవేళ పొరపాటున మీరు మీ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే మీఅకౌంట్‌ని హ్యాకర్ చేజిక్కించుకుంటాడు. ఒకవేళ మీ అకౌంట్‌కి క్రెడిట్ కార్డ్ లింక్ చేసి ఉంటే దానిని వాడే ప్రమాదం కూడా ఉంది.

**మందులు సరఫరా చేస్తామంటూ...**

లాక్‌డౌన్‌ను ఆసరాగా చేసుకుని నేరుగా మీ ఇంటికే కావలసిన మెడిసిన్స్ సప్లై చేస్తామంటూ, నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి, ఆర్డర్లు, పేమెంట్స్ స్వీకరిస్తూ ఆ తర్వాత పత్తా లేకుండా పోతున్నారు. అలాగే ఇంటికే లిక్కర్ సప్లై చేస్తామంటూ డబ్బులు వసూలుచేసి మాయమవు తున్నారు. మరికొంతమంది ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే కూరగాయలు, అవసరమైన సరుకులు సప్లై చేస్తామనీ మోసాలకు పాల్పడుతున్నారు.



**ప్రధాని డబ్బులు ఇస్తున్నాడు అంటూ...**


కరోనా వైరస్‌తో ఇబ్బందిపడుతున్న ప్రజానీకానికి ప్రధాని నేరుగా వారి అకౌంట్లలోకి డబ్బులు వేస్తున్నాడు. వాటిని క్లెయిమ్ చేసుకోవాలంటే ఈ లింక్ క్లిక్ చేయండి అంటూ కూడా కొన్ని ఫిషింగ్ లింకులు చలామణి అవుతున్నాయి. వాస్తవానికి ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకంలో భాగంగా ఉన్న 15.65 కోట్ల మంది మహిళలకు మాత్రమే ఒక్కొకరి అకౌంట్లో 500 రూపాయల చొప్పున మూడు నెలలపాటు జమ చేయబడుతుంది. అది నేరుగా సంబంధిత అకౌంట్లలోకి వెళుతుంది గానీ ఇలాంటి లింకులు క్లిక్ చెయ్యకూడదు.

**రాన్‌సంవేర్ ప్రమాదం**

హాస్పిటల్స్‌ని టార్గెట్‌గా చేసుకుని హ్యాకర్లు వాటి కంప్యూటర్లు, నెట్‌వర్క్‌లలో రాన్‌సంవేర్లు జొప్పిస్తున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, కేంద్ర ప్రభుత్వం నుంచి తాజా ఆదేశాలు అంటూ వివిధ హాస్పిటల్స్ సిబ్బందికి అటాచ్మెంట్‌లతో కూడిన మెయిల్స్ పంపిస్తున్నారు. వారు వాటిని క్లిక్ చేసిన వెంటనే హాస్పిటల్ కంప్యూటర్లోకి రాన్‌సంవేర్ రావడం జరుగుతోంది. దీంతో పేషెంట్ రికార్డులు, ఇతర కీలకమైన డాక్యుమెంట్లు, మొత్తం డేటా ఎన్‌క్రిప్ట్ అవుతుంది. ఆ డేటా తిరిగి పొందాలంటే హాస్పిటల్స్ భారీ మొత్తంలో బిట్‌కాయిన్ల రూపంలో చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

**నకిలీ అప్లికేషన్లు**


ఫోన్లో ఉన్న కెమెరాతో స్కాన్ చేస్తే మీకు కరోనా ఉందో లేదో తెలుసుకోవచ్చు! అంటూ కొన్ని యాప్స్ కనిపిస్తున్నాయి. మీకు దగ్గరలో కరోనా వ్యక్తి ఎవరైనా ఉన్నారేమో ఇలా తెలుసుకోండి! అంటూ మరికొన్ని యాప్స్ దర్శనమిస్తున్నాయి. వీటిలో చాలా వరకు అన్ని రకాల పర్మిషన్లు తీసుకుని యూజర్ల డేటాను దొంగలిస్తున్నాయి. కాబట్టి అలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండండి.



**నల్లమోతు శ్రీధర్**
fb.com/nallamothusridhar

**పనులన్నీ చకచకా కానిచ్చేస్తాము కానీ... రోజూ ఓ అరగంట వ్యాయామం చేయాలంటే మాత్రం ఎక్కడలేని బద్ధకం వచ్చేస్తుంది. అయితే ఈ లాక్‌డౌన్ సమయంలో ఇంట్లోనే ఉంటున్నాం కాబట్టి... పెద్దగా కదలకుండా, సోఫా మీదనో... మంచంపైనో కూర్చొనే కొన్ని ఎక్స్‌ర్‌సైజ్‌లు చేసుకోవచ్చు. అవే ఇవి...**

## వర్కవుట్ ఫ్రమ్ హోమ్



**పడుకొని:** మంచంపై కాళ్లు జాపుకొని వెల్లకిలా పడుకోండి. ఇప్పుడు కుడి మోకాలును మీ ఛాతీకి ఆనించే ప్రయత్నం చేసి, 20 సెకన్లు ఉంచండి. తరువాత మునుపటి పొజిషన్‌కు వచ్చేయండి. అలాగే ఎడమ మోకాలును ఆనించండి. అలా నాలుగు సార్లు చేయాలి.

**కూర్చొని:** సోఫాపైనో, మంచం మీదో కూర్చొని, కాళ్లు జాపండి. పాదాలు తలగడకో, గోడకో ఆనించండి. ముందుకు వంగి, చేతులతో బొటనవేళ్లు తాకి, 20 సెకన్లు ఉండండి. కాళ్లు మడవకూడదు. స్ట్రెయిట్‌గా పెట్టాలి. తరువాత సాధారణ పొజిషన్‌కు వచ్చి, మళ్లీ బొటనవేలు పట్టుకొంటూ... అలా ఐదుసార్లు చేయండి.





**నిల్చొని:** శరీరం బరువంతా మునివేళ్లపై పెట్టి... నిటారుగా నిల్చోండి. చేతులు పైకి ఎత్తి, బాడీని పూర్తిగా స్ట్రెచ్ చేయండి. బాగా ఊపిరి పీల్చుకొని, నిదానంగా వంగుతూ మునివేళ్లను పట్టుకోండి. అలా 10 సెకన్లు ఉండండి. ఈ మొత్తం చేయడానికి 20 సెకన్ల సమయం పడుతుంది. ఇప్పుడు యథాస్థితికి వచ్చి, మళ్లీ ఇదే విధంగా ఐదుసార్లు చేయండి.



బ్యూటీ కరోనా!


## ఇంట్లోనే పార్లర్



పార్లర్‌లు లేని కరోనా కాలంలో ఇంట్లోనే అందాన్ని పెంచుకునేందుకు ఇలా చేయండి...

- ❖ ఓట్స్, తేనె, యోగర్ట్ కలిపిన మిశ్రమాన్ని ముఖం మీద స్క్రబ్బర్‌లా రుద్దుకోవాలి. ఇలాచేస్తే మృతకణాలు తొలగిపోతాయి. చర్మం తాజాగా, నిగారింపుతో కనిపిస్తుంది. లేదంటే ఎర్ర కంది పప్పును రాత్రంతా నానబెట్టి, పొద్దున్నే పేస్ట్‌లా చేసుకొని ముఖానికి ఫేస్‌మాస్క్‌లా రాసుకున్నా ముఖం వెలిగిపోతుంది.
- ❖ బ్లాక్ టీని కురులకు పట్టిస్తే, జుట్టు పట్టులా మెరుస్తూ కనిపిస్తుంది. వారంలో రెండు సార్లు షాంపూతో తలస్నానం చేసిన తరువాత ఇలాచేస్తే ఫలితం ఉంటుంది.
- ❖ గోళ్లు అందంగా మెరవాలంటే... గోళ్ల చివర్లో ఉన్న మృతకణాలను తొలగించి, బాదం నూనె లేదా కొబ్బరి నూనెతో పాలిష్ చేయాలి. దాంతో గోళ్ల దగ్గరి చర్మానికి పోషణ లభిస్తుంది.

● కామిక్ కరోనా — కార్టూన్: చారి పి.ఎస్



## ఇల్లు ఖాళీ చేయాలని బెదిరిస్తే చర్యలే

▸ పీపీఈలనూ అందుబాటులో ఉంచండి: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కరోనా సోకిన వారి కోసం అహరహం శ్రమిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది నివశిస్తున్న అద్దె ఇళ్లను ఖాళీ చేయాలని సదరు ఇంటి యజమాని బెదిరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. వైద్యుల ఫిర్యాదుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పింది. అదేవిధంగా కరోనా బాధితులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ సామగ్రి(పీపీఈ)ని అందుబాటులో ఉంచడంతోపాటు అనువైన సదుపాయాలు కల్పించాలని గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు మరో ఎంపీ, ఎమ్మెల్యే గత మార్చి 30న భౌతికదూరం పాటించకుండా అధికారులతో సమావేశం నిర్వహించారంటూ అందిన లేఖపై స్పందిస్తూ.. రాజకీయ నేతలు బహిరంగ సమావేశాలు నిర్వహించరాదని, వారిని అడ్డుకోవాలని సీఎస్, డీజీపీలను ఆదేశించింది.

## సర్వేలో పాల్గొనని వలంటీర్లపై వేటు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాధి లక్షణాలతో బాధపడే వారిని, విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించేందుకు పట్టణాల్లో చేపడుతున్న ఇంటింటి సర్వేకు కొందరు వలంటీర్లు దూరంగా ఉంటున్నారు. దీంతో సర్వేలో పాల్గొనని వార్డు వలంటీర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వారిస్థానంలో కొత్తవారిని నియమించాలని సూచించింది.

## ఈ నెలకు మార్చి బిల్లే.. విద్యుత్ సంస్థల నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు మార్చి నెలలో ఎంత మొత్తానికి విద్యుత్ బిల్లు ఇచ్చారో ఈ నెలలోనూ అదే మొత్తానికి బిల్లు ఇవ్వాలని విద్యుత్ సంస్థలు నిర్ణయించాయి. లాక్‌డౌన్ వల్ల ఇంటింటికీ తిరిగి మీటర్ రీడింగ్ నమోదు చేసే పరిస్థితి లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకొన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి దీనికి అనుమతిస్తూ ఆదేశాలు జారీచేశారు.

## కరోనా 'కంటైన్మెంట్' ప్రణాళిక ఇదీ!

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా మరణాలను తగ్గించేలా, నిఘా ప్రణాళికలను అమలు చేయడానికి ఆరోగ్యశాఖ ప్రత్యేక కంటైన్మెంట్ ప్రణాళికను విడుదల చేసింది. కరోనా వ్యాప్తిని నిరోధించడానికి కంటైన్మెంట్ స్ట్రాటజీ, నిర్వహణ, కంటైన్మెంట్ ప్రాంతాల్లో స్క్రీనింగ్ చేయడం, పర్యవేక్షణ, నిఘాలాంటి అనేక అంశాలను ఈ మార్గదర్శకాల్లో పేర్కొంది.

## జగన్‌ది ప్రతీకార చర్య: కన్నా

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'వ్యక్తిగత ప్రతీకారంతో ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చిన ప్రతిపాదిత ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం. ఎన్నికలు వాయిదా వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్‌పై ప్రతీకారం తీర్చుకున్నారు. ఆ ఆర్డినెన్స్‌ను తిరస్కరించండి" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషర్ సునీల్ ఆరోరా, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు వేర్వేరుగా లేఖలు రాశారు.

## కరోనాపై శ్వేతపత్రం: టీడీపీ డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): "కరోనాపై నిరంతరం పోరాడుతున్న వైద్యులకు, ఇతర ఉద్యోగులకు కనీసం మాస్కులు కూడా ఇవ్వడం లేదు. వైరస్ నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శ్వేత పత్రం విడుదల చేయాలి" అని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. వైద్యులకు కనీసం మాస్కులు కూడా ఇవ్వడం లేదన్న దళితుడు, డాక్టర్ సుధాకర్‌ని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్న నగరి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేయడాన్ని ఆక్షేపించారు.

## ఆ మంత్రిని క్వారంటైన్‌లో ఉంచాలి: బుద్దా

విజయవాడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'లాక్‌డౌన్‌ను ప్రజలందరూ క్రమశిక్షణతో పాటిస్తుంటే.. రాష్ట్ర మంత్రులు, వైసీపీ నేతలు మాత్రం తమకేమీ పట్టనట్టుగా తిరుగుతున్నారు. వైరస్ వ్యాప్తికి ఆజ్యం పోస్తున్నారు. మంత్రి ఆదిమూలపు సురేశ్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు హైదరాబాద్ వెళ్లి వచ్చారు. వారిని ప్రభుత్వం వెంటనే క్వారంటైన్ సెంటర్లకు తరలించాల'ని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు.

## ప్రజాస్వామ్యం ఖూనీ: లోకేశ్

"ఎస్ఈసీ తొలగింపు జగన్ నియంతృత్వపు పోకడలకు పరాకాష్ఠ. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ట్విటర్‌లో మండిపడ్డారు. తన నిర్ణయానికి అడ్డువచ్చిన వారెవరూ ఉండకూడదన్న మనస్తత్వం ఆందోళనకరమన్నారు.

## ఎస్ఈసీ తొలగింపు దుర్మార్గం: శైలజానాథ్

అమరావతి, విజయవాడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకురావడం సీఎం నిరంకుశత్వానికి నిదర్శనమని పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ విమర్శించారు. తన మాట విననందుకే లక్ష్యం చేసుకుని జగన్ ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని అన్నారు..

## సస్పెన్షన్ చట్టవిరుద్ధం: నారాయణ

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్‌ను ఆర్డినెన్స్ ద్వారా సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఎన్నికల కమిషన్‌పై చర్యలు తీసుకునే హక్కు పార్లమెంట్‌కు తప్ప మరెవ్వరికీ లేదన్నారు. తమకు అనుకూలంగా లేరనే వైసీపీ ప్రభుత్వం రమేశ్ కుమార్‌పై కత్తి కట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు డిమాండ్ చేశారు.

## కక్షపూరిత రాజకీయాలకు ఇదా సమయం: పవన్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): "కరోనా బెంగతో ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రమేశ్‌కుమార్‌ను తొలగించడానికి ప్రభుత్వ పెద్దలు కక్షపూరిత రాజకీయాలు చేయడానికి ఇదా సమయం" అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. హైకోర్టుతో చీవాట్లు పెట్టించుకున్నా 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్న సామెతలా జగన్‌రెడ్డి ప్రభుత్వ వ్యవహారం సాగుతోందన్నారు.

## పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్!

▸ తహశీల్దార్ వనజాక్షికి వైసీపీ బహుమానం

విజయవాడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చేవరకు వైసీపీ నోట తహశీల్దార్ డి.వనజాక్షి పాట వినబడేది! వనజాక్షిని అడ్డం పెట్టుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసింది. తీరా అధికారంలోకి వచ్చాక తమ మాట వినలేదని ఆమెకు పోస్టింగే లేకుండా చేసింది. విజయవాడ రూరల్ తహశీల్దార్ వనజాక్షి.. వెన్నునొప్పితో మార్చి 3న సెలవుపెట్టారు. తిరిగి జాయిన్ అయ్యేందుకు మార్చి 11న రాగా.. నాటి నుంచి ఆమెతో కృష్ణా జిల్లా యంత్రాంగం ఆడుతోంది. అధికార పక్ష కీలకనేత ఒత్తిళ్లతో వనజాక్షికి ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెట్టడం గమనార్హం. ప్రభుత్వ వ్యవహారాలను పర్యవేక్షించే సదరు వైసీపీ నేత గొల్లపూడిలో ఉంటున్నారు. కృష్ణాజిల్లా యంత్రాంగం ఆయన కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లి భూములను తీసుకోవడం వివాదాస్పదమైంది. రైతులతో సమావేశం నిర్వహించినపుడు తహశీల్దార్ వనజాక్షిని వారు అడ్డగించటం, తహశీల్దార్ రైతులపై చేయి చేసుకోవడం జరిగాయి. నిజానికి కొత్తూరు తాడేపల్లిలో సేకరించాలనుకున్న 350 ఎకరాల భూమిలో 300 ఎకరాలు చేతులు మారినవే ఉన్నాయి. పీవోటీ ల్యాండ్స్ విషయంలో తహశీల్దార్ ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికీ లేదు. ఎవరైనా కేసు వేస్తే బుక్కయ్యేది తహశీల్దారే! దీంతో వనజాక్షి ఆ ప్రయత్నాన్ని విరమించి, పట్టా భూముల రైతులతో మాట్లాడి ఒప్పించి కొత్తూరులో 100 ఎకరాలు, తాడేపల్లిలో మరో 100 ఎకరాలు.. మొత్తం 200 ఎకరాలను గుర్తించారు. ఇది వైసీపీ కీలక నేతకు రుచించలేదు. అసైన్డ్ భూముల్లో టీడీపీ వారు ఎక్కువగా ఉన్నారు. ఆ భూములను తీసుకుంటే వారిని తరిమేయవచ్చని.. తక్కువ పరిహారంతో చేతులు దులుపుకోవచ్చన్నది ఆ నేత ఆలోచన. దీంతో జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అదేమిటో చూడాలని ఉన్నతాధికారులు వనజాక్షిపై ఒత్తిడి మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆమె వెన్నుకు దెబ్బ తగలటంతో మార్చి 3 నుంచి 10 వరకు వారం రోజుల పాటు సెలవు పెట్టారు. అనంతరం విధి నిర్వహణలో జాయిన్ అవుదామని వస్తే.. పోస్టింగ్ ఇవ్వలేదు.



## ఈ అవ్వకు అందరూ ఉన్నా..

సొంత మనుషుల మరణం కలిగించే వేదన కన్నా, సరిగ్గా సాగనంపలేకపోయామనే బాధే కరోనా కాలంలో కుటుంబాలను ఎక్కువగా కుంగదీస్తోంది. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన నూర్జమ్మ (85) అంత్యక్రియల విషయంలో ఇదే జరిగింది. అనారోగ్యంతో మరణించిన నూర్జమ్మ మృతదేహాన్ని మనుమడు బాలుస్వామి ఓ బండిపై ఉంచుకొని శ్మశానానికి బయలుదేరాడు. లాక్‌డౌన్ ఉండటంతో బంధువులూ, చుట్టుపక్కలవారిలో ఎవరూ బాలుస్వామి వెంట అడుగులు వేయలేకపోయారు. దీంతో ఒక్కడే దాదాపు ఒకటిన్నర కిలోమీటర్లు ఆ బండిని తోసుకొంటూ వెళ్లాడు. రైల్వే డబుల్ క్వార్టర్స్ పక్కన ఉన్న క్రిస్టియన్ శ్మశానానికి చేరుకొని.. అక్కడ అంత్యక్రియలు పూర్తిచేశాడు.

- గుంతకల్లు



అత్యధిక పాజిటివ్ కేసులు ఉన్న ఒంగోలు ఇస్లాంపేటలో ఇళ్లను సర్వే చేస్తున్న కోర్ టీం

# త్వరలోనే అదుపులోకి..

▸ రాష్ట్ర ఆరోగ్యస్థితిపై సీఎం సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారానే కరోనా లాంటి వైరస్‌లనూ, ఇతర వ్యాధులనూ అడ్డుకోగలమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మహమ్మారిలా కరోనా ప్రబలం అవుతున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్లు, కొవిడ్-19 ఆస్పత్రుల వైద్యులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారానూ, తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతోనూ పరిస్థితిని ఆయన సమీక్షించారు. లాక్‌డౌన్ అమలు తీరు, వ్యాధి తీవ్రత నిరోధానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వారికి నిర్దిష్టమైన ఆదేశాలను జారీచేశారు. "కరోనా మీద యుద్ధంలో వైద్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయం. పారామెడికల్ సిబ్బంది, నర్సులు, పారిశుధ్య సిబ్బంది హృదయపూర్వకంగా సేవలందిస్తున్నారు. వైద్య సేవలు అందించడంలో రిస్క్ ఉంటుందని తెలిసనప్పటికీ కూడా చాలా కష్టపడి సేవలందిస్తున్నారు. తెలియని భయం ఉన్నప్పటికీ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లకు హాట్సాఫ్. వారికి సెల్యూట్ చేస్తున్నాను" అని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రానికి సంబంధించి నాలుగు క్రిటికల్ కేర్ ఆస్పత్రులను ఉత్తమ వైద్య సేవలను అందించడానికి గుర్తించామని, భవిష్యత్తుల్లో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అదనంగా ఐదేసి ఆసుపత్రులు గుర్తిస్తున్నామని ఆయనకు అధికారులు వెల్లంచారు. ఆస్పత్రుల్లో 'నాడు-నేడు' ద్వారా పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సిబ్బందికి క్రిటికల్ కేర్‌లో భాగంగా వెంటిలేటర్ల వినియోగంపై శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. నిర్మాణాత్మక ఆలోచనలతోనూ, సమగ్ర కార్యాచరణలతోనే ఇలాంటి వైరస్‌లను, వ్యాధులను అడ్డుకోగలమని అభిప్రాయపడ్డారు. దానికోసం సరిపడా వైద్యులు, సిబ్బందిని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని జగన్ భావించారు. ప్రతి ఇంటికీ సర్వే, భారీగా ర్యాపిడ్ పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆరోగ్య కార్డుల్లో వివరాల నమోదు చేయాలని సీఎం నిర్దేశించారు. దీనివల్ల వ్యక్తి ఆరోగ్య వివరాలను కూడా పనిలో పనిగా నమోదు చేసే అవకాశం ఉంటుందన్నారు.

**లాక్‌డౌన్ తొలగిస్తే...:** లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తే ఎలాంటి విధానాలను అనుసరించాలన్న అంశంపైనా చర్చ జరిగింది. వీలైనన్ని పరీక్షలు చేయడం ద్వారా వైరస్ సోకినవారిని నిర్ధారించడం, వారి ప్రైమరీ కాంటాక్టులను గుర్తించి వైద్యాన్ని అందించే వ్యూహాన్ని అమలు చేయాలని సీఎం అదేశించారు. "రాష్ట్రం మొత్తమ్మీద పరిస్థితి అదుపులోనే ఉంది. రాబోయే రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయి. ఢిల్లీ నుంచి వచ్చిన వారి కారణంగా కేసుల సంఖ్య పెరిగింది. తబ్లీగీకి హాజరయినవారినే కాకుండా, వారితో ప్రైమరీ, సెకండరీ కాంటాక్టులో ఉన్నవారినీ గుర్తించాం. వారందరినీ పూర్తిగా క్వారంటైన్‌లో లేదా ఐసోలేషన్‌వార్డుల్లో పెట్టి చికిత్సను అందిస్తున్నాం" అని సీఎం తెలిపారు. జలుబు, గొంతునొప్పి, జ్వరం లక్షణాలతో ఉన్నవారందరికీ పరీక్షలు చేయించాలని స్పష్టం చేశారు.

జిల్లాల వారీగా కేసుల వివరాలు...

| జిల్లా | పాజిటివ్ | డిశ్చార్జి |
|---|---|---|
| అనంతపురం | 15 | - |
| చిత్తూరు | 20 | 1 |
| తూర్పుగోదావరి | 17 | 1 |
| గుంటూరు | 58 | - |
| కడప | 29 | - |
| కృష్ణా | 35 | 3 |
| కర్నూలు | 77 | - |
| నెల్లూరు | 48 | 1 |
| ప్రకాశం | 40 | 1 |
| విశాఖపట్నం | 20 | 4 |
| పశ్చిమగోదావరి | 22 | - |
| మొత్తం | 381 | 11 |



అనంతపురం పాతూరులో గుంపులు గుంపులుగా తిరుగుతున్న జనం

## కఠిన చర్యలతో భయం, శత్రుత్వం!

▸ ప్రజల్లో కళంక ప్రవర్తన కూడా!

▸ అవగాహన పెంచాలి: కొవిడ్ నోడల్ అధికారి

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యాధి నిర్ధారణకు తీసుకునే చర్యలవల్ల ప్రజల్లో భయం, శత్రుత్వం, పక్షపాతం, సామాజిక అంతరాయాలు పెరుగుతాయా? కరోనా లాక్‌డౌన్‌కూ... ప్రజల్లో శత్రుత్వానికీ సంబంధమేమిటంటారా! కచ్చితంగా ఉందని సర్కారు వారు జారీ చేసిన ఒక ప్రకటన తేల్చిచెబుతోంది. "అంటువ్యాధుల వ్యాప్తి సమయంలో వైరస్ విస్తరణను నిరోధించేందుకు ప్రభుత్వం విధించే కఠిన అత్యవసర పరిస్థితులు ప్రజలకు భయం, ఆందోళనను కలిగిస్తాయి. అంతేకాకుండా అనవసరమైన సామాజిక అంతరాయాలకు దారితీస్తాయి. సామాజిక ఒంటరితనం వల్ల ఏర్పడే గందరగోళ పరిస్థితులు ఇతరుల పట్ల శత్రుత్వం, పక్షపాతాలకు దారితీసే కళంకమైన ప్రవర్తన ఏర్పడుతుంది" అని కరోనా రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ప్రజల్లో తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కరోనాకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో ఫార్వార్డ్ చేసేముందు, అది నిజమో కాదో నిర్ధారించుకోవాలని సూచించారు.

## మద్యం డిపోల హమాలీలకు 5 వేలు అడ్వాన్స్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కరోనా వల్ల మద్యం షాపులు, బార్లు మూతపడడంతో ఉపాధి కోల్పోయిన మద్యం డిపోల్లోని హమాలీలకు రూ.5 వేలు అడ్వాన్స్‌గా ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు అడ్వాన్స్ రూపంలో నగదు ఇవ్వాలంటూ ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి అన్ని డిపోల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని 28 డిపోల్లో పనిచేస్తున్న 2,097 హమాలీలకు ఊరట లభించనుంది. దీనికిగాను రూ.కోటి నిధులు వెచ్చిస్తున్నట్లు ఎండీ తెలిపారు.

## నగరి కమిషనర్‌పై వేటు

▸ వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్.. ప్రభుత్వంపై విమర్శల ఫలితం



తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నగరి మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు పురపాలక శాఖ కమిషనర్ జేఎస్సార్కేఆర్ విజయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరి పరిధిలో కరోనా నియంత్రణ చర్యలకు రాష్ట్రప్రభుత్వం నుంచి ఒక్క రూపాయైనా రాలేదని, మాస్కులు, గ్లవుజులు, బూట్లు తదితర రక్షణ సామగ్రిని కూడా సరఫరా చేయలేదంటూ ఆయన గురువారం సెల్ఫీ వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఇవ్వకున్నా స్థానిక ఎమ్మెల్యే రోజా డబ్బు ఖర్చు పెట్టి నగరి ప్రజలను ఆదుకుంటున్నారని ఆమెను ఆకాశానికెత్తారు. అయితే విమర్శలు చేసినందుకు ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. తక్షణం ఇది అమల్లోకి వస్తుందని.. సస్పెన్షన్ కాలంలో వెంకట్రామిరెడ్డి నగరి పట్టణం వీడి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన స్థానంలో నగరి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ వెంకటేశ్వరరావును ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించింది.

### నాపై తప్పుడు ప్రచారం..

సస్పెన్షన్ వేటు వేశాక వెంకట్రామిరెడ్డి మాట మార్చారు. తాను అనని మాటలను ఎవరో వక్రీకరించారని అన్నారు. కొంతమంది స్థానిక నాయకులు తనపై కక్షగట్టి తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. శుక్రవారం ఈ మేరకు మరో సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు తీసుకొస్తున్న జగన్ ప్రభుత్వంపై నిందలు వేశానంటూ కావాలనే తనపై రాజకీయ నాయకులు తప్పుడు ప్రచారం చేయించారని ఆరోపించారు.

## రాష్ట్రంలో 133 రెడ్‌జోన్లు

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతోంది. ఈ క్లస్టర్ల వద్ద కరోనా వ్యాప్తి నివారణ, ప్రజారోగ్య చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి క్వారంటైన్, భౌతిక దూరం పాటించడం, మెరుగైన నిఘా, అనుమానాస్పద కేసులన్నింటినీ పరీక్షించడం, కాంటాక్ట్ అందర్నీ ఐసోలేషన్‌లో పెట్టడం, కమ్యూనిటీ వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలను కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. కరోనా కేసులున్న ప్రాంతం నుంచి 3కి.మీ. పరిధిలో ఉన్న ప్రాంతాన్ని కంటైన్మెంట్ క్లస్టర్‌గా తీసుకుంటున్నారు. కేసుల వ్యాప్తికి వీలున్న 5కి.మీ. ప్రాంతం బఫర్‌జోన్‌గా గుర్తిస్తున్నారు. గ్రామాల్లో బఫర్ జోన్లను 7కి.మీ. వరకూ విస్తరిస్తారు. కంటైన్మెంట్ జోన్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద థర్మల్ స్క్రీనింగ్ చేస్తారు. వాహనాల కదలికను నిషేధించారు.

రెడ్ జోన్లుగా గుర్తించిన ప్రాంతాలు

| జిల్లా | క్లస్టర్లు |
|---|---|
| గుంటూరు | 12 |
| కడప | 6 |
| ప్రకాశం | 11 |
| కృష్ణా | 16 |
| పశ్చిమ గోదావరి | 12 |
| విశాఖపట్నం | 6 |
| తూర్పు గోదావరి | 8 |
| చిత్తూరు | 7 |
| నెల్లూరు | 30 |
| అనంతపురం | 3 |
| కర్నూలు | 22 |

# మహిళలపై పంజా

▸ రాష్ట్రంలో 18 కొత్త కరోనా కేసులు

▸ వీరిలో 12 మంది మహిళలే

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మహిళలపై కరోనా పంజా విసురుతోంది. రాష్ట్రంలో శుక్రవారం 18 కొత్త పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 12మంది మహిళలే ఉన్నారు. గుంటూరు జిల్లాలో ఏడుగురికి, తూర్పు గోదావరిలో ఐదుగురు, కర్నూలు, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో ఇద్దరు చొప్పున పాజిటివ్‌లు నిర్ధారణ అయ్యాయి. ఢిల్లీ లింక్ కారణంగా గుంటూరులో రెండు వేర్వేరు కుటుంబాలకు చెందిన తల్లీకూతుళ్లలో వైరస్ లక్షణాలు బయటపడ్డాయి. శ్రీనివాసరావుపేటకు చెందిన మరో వ్యక్తికి కూడా పాజిటివ్ వచ్చింది. మరో రెండు కేసులకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. అనంతపురం జిల్లాలో మక్కా వెళ్లొచ్చిన హిందూపురం వాసితో కాంటాక్ట్‌లో ఉన్న పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువుకు చెందిన వ్యక్తి(56)కి కరోనా లక్షణాలు పెరిగిపోవడంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అతనికి పాజిటివ్ అని నిర్ధారణ అయింది. అనంతపురం నర్సింగ్ కాలేజీలో ట్యూటర్‌గా పనిచేస్తున్న స్టాఫ్ నర్సు(35) మక్కా వెళ్లొచ్చిన హిందూపురం వాసికి వైద్యపరీక్షలు చేసింది. ఆ వ్యక్తికి పాజిటివ్ రావడంతో ఆమెకూ పరీక్షలు నిర్వహించగా వైరస్ సోకినట్లు తేలింది. ప్రకాశం జిల్లాలో రెండు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. శనివారం నుంచి జిల్లాలో ప్రకటించిన 11 రెడ్‌జోన్లలో కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, గుడ్లూరుకు చెందిన మహిళ కరోనా లక్షణాలతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో ఆమె చికిత్స పొందిన సింగరాయకొండ, ఉలవపాడు, చాకిచర్ల వైద్యశాల సిబ్బందితో పాటు ఆమె కుటుంబసభ్యులను కూడా క్వారంటైన్‌కు తరలించారు. కర్నూలు జిల్లాలో ఢిల్లీ వెళ్లి వచ్చినవారి నుంచి కర్నూలు అర్బన్, ఆత్మకూరుకు చెందిన ఇద్దరు మహిళలకు వైరస్ సోకింది.

### విజయవాడలో మరొకరు డిశ్చార్జి

కరోనా బారినపడి విజయవాడ కోవిడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం సాయంత్రం డిశ్చార్జి చేశారు. స్వీడన్ నుంచి గతనెలలో విజయవాడ వచ్చిన ఆయనకు పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. అప్పటి నుంచి ఆ యువకుడిని ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందించారు. ఇటీవల రెండుసార్లు పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ రిపోర్టులు రావడంతో పూర్తిగా కోలుకున్నట్టు నిర్ధారించిన వైద్యాధికారులు ఆయన్ను డిశ్చార్జి చేశారు.

## పిల్లల నుంచి పెద్దలకు...!

▸ కత్తిపూడిలో కరోనా కలకలం

విశాఖ నుంచి తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడిలో అత్తారింటికి వచ్చిన ఓ ఉపాధ్యాయుడికి గురువారం కరోనా నిర్ధారణ అయింది. ఆయనతో కాంటాక్ట్ ఉన్న 38మంది నమూనాలు పరీక్షించగా, ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. వీరిలో సదరు ఉపాధ్యాయుడి కూతురు(8) కూడా ఉంది. ఈ చిన్నారి ఆడుకున్న మరో మూడేళ్ల పసిపాపతో పాటు ఆమె తల్లి(28), నానమ్మ(50)కు కూడా వైరస్ సోకినట్లు తేలింది. ఉపాధ్యాయుడి అత్తారింటికి వచ్చే దగ్గరి బంధువు అయిన మరో మహిళ(28)కు కూడా పాజిటివ్ వచ్చింది. టీచరుకు కత్తిపూడిలో చికిత్స చేసిన ఆర్ఎంపీ ఆస్పత్రిని, మెడికల్ షాపు, ల్యాబ్‌ను సీజ్‌చేసి కేసులు పెట్టారు.

### న్యూయార్క్‌లో అనకాపల్లి వాసి మృతి

అమెరికాలోని న్యూయార్క్‌లో అనకాపల్లికి చెందిన ఇంజనీర్ తమ్మన నూకయ్యశెట్టి(80) చాలా ఏళ్ల క్రితం స్థిరపడ్డారు. ఆయన గత నెల 31న కరోనా లక్షణాలతో మృతిచెందారని బంధువులు శుక్రవారం తెలిపారు.

# దొంగ దెబ్బ!

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్‌లో రాష్ట్ర మంత్రులతో కేబినెట్ సమావేశం నిర్వహించి... ఆర్డినెన్స్‌పై ఆమోద ముద్ర పొందింది. ఆ వెంటనే దీనిని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు పంపింది. గవర్నర్ కూడా దీనిని ఆమోదించారు.

### ఆర్డినెన్స్... చకచకా జీవోలు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994లోని సెక్షన్ 200ను సవరిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆర్డినెన్స్ నెంబర్ 5 జారీ చేసింది. ఈ సెక్షన్ ప్రకారం ఎస్ఈసీగా కనీసం ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్‌ను నియమించాల్సి ఉంది. ఇప్పుడు... దీనిని సవరించి రిటైర్డ్ హైకోర్టు జడ్జిని నియమించాలని నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీకాలం ఐదేళ్లు ఉంది. దానిని మూడేళ్లకు కుదించారు. గరిష్ఠంగా మరో విడత (మూడేళ్లు) పొడిగింపు ఇవ్వొచ్చు. హైకోర్టు జడ్జితో సమానంగా వేతనాలు, అలవెన్సులు చెల్లిస్తారు. ఆర్డినెన్స్‌పై గవర్నర్ ఆమోద ముద్ర పడగానే... చకచకా మూడు జీవోలు వెలువడ్డాయి. పంచాయతీరాజ్ శాఖ, న్యాయశాఖల్లో గ్రామీణ ఎన్నికలకు సంబంధించి ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆర్డినెన్స్‌ను అమలులోకి తెస్తూ ఒక జీవో జారీ చేశారు. ఆ తర్వాత... ఆర్డినెన్స్‌కు అనుగుణంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదీ జీవో నెంబరు 617 జారీ చేశారు. ఇందులోనే సీఈసీ నియమాకంలో చేసిన సవరణల గురించి వివరించారు. ఈ జీవో అమలులోకి రాగానే ప్రస్తుతం ఎస్ఈసీ పోస్టులో ఉన్న వ్యక్తి పదవీకాలం ముగిసినట్లే అని తెలిపారు. ఆ తర్వాత... జీవో నెంబర్ 617 మేరకు రమేశ్ కుమార్‌కు ఉద్వాసన పలుకుతున్నట్లుగా మరో జీవో నెంబర్ 618 వెలువడింది. రమేశ్ కుమార్ ఎస్ఈసీగా ఆయన బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు దాటింది. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు ఆయన పదవీ కాలం ఉంది. ఆయన స్థానంలో రాష్ట్రానికి కొత్త ఎస్ఈసీని నియమిస్తూ మరో జీవో జారీ చేసినట్లు సమాచారం! ఈ మూడు జీవోలను శుక్రవారం రాత్రి పొద్దు పోయేదాకా గోప్యంగా (కాన్ఫిడెన్షియల్) ఉంచారు.

## అంత ఈజీ కాదు!

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(కె)లో ఎస్ఈసీ పదవీకాలం, అధికారం, బాధ్యతలు, విధులను స్పష్టంగా వివరించారు. ప్రభుత్వాల ఇష్టాఇష్టాల మేరకు ఆయనను తొలగించేందుకు వీల్లేకుండా, నియామక ఉత్తర్వుల్లోనే పదవీకాలాన్ని కూడా నిర్ణయిస్తారు. ఐదేళ్ల పదవీకాలం లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు.. రెండింటిలో ఏది ముందైతే అది వర్తించేలా రమేశ్‌కుమార్ రిటైర్ కావాల్సి ఉంది. ఎస్ఈసీని అర్ధంతరంగా తొలగించడం సులభం కాదు. హైకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు పాటించే విధానాలనే పాటించాలి. అంటే పార్లమెంటు, రాష్ట్రపతి అంగీకరించాలి. సభకు హాజరై ఓటేసిన వారిలో మూడింట రెండొంతుల మెజార్టీతో పార్లమెంటులో తీర్మానం ఆమోదం పొందాలి. తర్వాత రాష్ట్రపతికి పంపి ఆమోదం తీసుకోవాలి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఈసీ పదవీకాలాన్ని మూడేళ్లకు కుదించింది. దీని ప్రకారం రమేశ్ కుమార్ పదవీకాలం ముగిసిందనే భాష్యం చెబుతోంది. నిజానికి ఈ వాదన పూర్తిగా అసంబద్ధం. కొత్తగా తెచ్చిన మార్పులేవైనా రాబోయే ఎస్ఈసీకి వర్తిస్తాయి తప్ప, ఇప్పుడు పదవిలో ఉన్న వ్యక్తికి కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

## స్ఫూర్తిని వదిలేసి.. ఒక్క అంశాన్నే పట్టుకుని!

▸ అడ్డగోలుగా ఆర్డినెన్స్ జారీ


ఎస్ఈసీ పదవీకాలం కుదింపు ఆర్డినెన్స్‌లో ప్రభుత్వం అలహాబాద్ హైకోర్టు తీర్పును ప్రస్తావించింది. రాజ్యాంగానికి భిన్నంగా ఆర్డినెన్స్ ఎలా తెస్తారని గవర్నర్ హరిచందన్ ప్రశ్నించగా... అపర్మిత ప్రసాద్ సింగ్ వర్సెస్ యూపీ ప్రభుత్వాల మధ్య నడిచిన కేసును వివరించినట్లు సమాచారం. నిజానికి ఇది గవర్నర్‌ను పూర్తిగా తప్పుదోవ పట్టించడమేనని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే... రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ పదవీకాలాన్ని కుదించడానికి వీల్లేదని అలహాబాద్ హైకోర్టు స్పష్టంగా చెప్పింది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా రాజ్యాంగంలో పదవీ కాలానికి సంబంధించిన అంశాలను పొందుపరిచారని... దానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోకూడదని తెలిపింది. ఆ కేసు తీర్పులో ఉన్న ప్రతి అంశంలోను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీకాలాన్ని తగ్గించడం కుదరదనే చెప్పింది. అయితే, అప్పటికే కొత్త ఎన్నికల కమిషనర్‌ను నియమించినందున.. ఆయన వాదన కూడా విని కేసును పరిష్కరిస్తామని తీర్పు చెప్పింది. తీర్పులో పేర్కొన్న 99 శాతం అంశాలను, తీర్పు స్ఫూర్తిని వదిలేసి కొత్త అధికారి వాదన కూడా వినాలన్న పాయింట్‌ను పట్టుకుని... ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలకు కోర్టులో చుక్కెదురవుతున్న సంగతి తెలిసిందే! ఎస్ఈసీ పదవీకాలం కుదిస్తూ.. రమేశ్ కుమార్‌కు ఉద్వాసన పలకడం కూడా న్యాయ సమీక్షకు నిలబడదని నిపుణులు చెబుతున్నారు. రాజ్యాంగంలోని 243(కె) ఆర్టికల్‌కు ఇది విరుద్ధమని, ఆర్డినెన్స్ జారీకి ప్రధాన భూమిక అయిన అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇక్కడ వర్తించదని పేర్కొంటున్నారు. నిజానికి... రమేశ్ కుమార్‌కు చెక్ పెట్టేలా ఎస్ఈసీకి సమాంతర వ్యవస్థను తీసుకురావాలని జగన్ సర్కారు తొలుత భావించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ తరహాలోనే ముగ్గురు కమిషనర్ల వ్యవస్థ తీసుకురావాలని యోచించింది. అయితే... రాష్ట్రస్థాయిలో ముగ్గురిని నియమించడం కుదరదని తేలడంతో ఆ ప్రయత్నాలు మానుకున్నారు. ఎలాగైనా రమేశ్ కుమార్‌ను తొలగించాలన్న పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆసరాగా తీసుకుంది. తనను తొలగించడంపై రమేశ్‌కుమార్ హైకోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

# కరోనా కల్లోలం

## కరోనా 'కుటుంబం'

### జన్యు మార్పుల ఆధారంగా ఏ, బీ, సీగా వర్గీకరణ

**2 నెలల్లో.. 3 జన్యు మార్పులు! కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తల అధ్యయనం**



లండన్, ఏప్రిల్ 10 : కరోనా వైరస్‌పై జరుగుతున్న పరిశోధనల్లో మరో పురోగతి నమోదైంది. చైనాలోని వూహాన్‌లో తొలి కరోనా కేసు నమోదైనప్పటి నుంచి ఇప్పటివరకు కొవిడ్-19లో ఎలాంటి జన్యుమార్పులు జరిగాయి? అనేది తెలుసుకునేందుకు బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ వర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో పలు కొత్త విషయాలు వెలుగుచూశాయి. అధ్యయనంలో భాగంగా వివిధ దేశాల్లో డిసెంబరు 24 నుంచి మార్చి 4 మధ్యకాలంలో 160 మంది నుంచి శాంపిళ్లను సేకరించి, వైరస్‌లలో జన్యు మార్పులను పరిశీలించారు. ఆ 2 నెలల వ్యవధిలో 3 రకాల జన్యుమార్పులతో కూడిన కరోనా వైరస్‌లు ఇన్ఫెక్షన్లకు కారణమయ్యాయని గుర్తించారు. వాటికి ఎ, బి, సి అని పేర్లు పెట్టారు. ఈ మహమ్మారి ప్రబలడానికి 'ఎ' రకం ఊతమిచ్చిందని.. దీనిలో చోటుచేసుకున్న రెండు జన్యుమార్పులతో 'బి' రకం వైరస్ ఏర్పడిందన్నారు. దీనికి 'సి' రకం వైరస్ కూతురులాంటిదని తెలిపారు.

'ఏ' రకం కొవిడ్-19 వైరస్ చైనాలో తొలి ఇన్ఫెక్షన్‌కు బీజాలు వేసిందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. అయితే ఇన్ఫెక్షన్‌లకు ప్రధాన కేంద్రంగా మారిన వూహాన్‌లో 'ఏ' రకం వైరస్ జాడ అంతగా లేదన్నారు. ఆ నగరంలోని అమెరికన్లలో మాత్రం కొన్ని మార్పుల తో కూడిన 'ఏ' రకం కరోనా ఆనవాళ్లను గుర్తించామన్నారు. ఆశ్చర్యకరంగా అమెరికా, ఆస్ట్రేలియాలలో సింహభాగం పాజిటివ్ కేసుల్లో 'ఏ' రకం ఉందన్నారు.

'బీ' రకం కరోనా వైరస్ ఇన్ఫెక్షన్లు ప్రధానంగా చైనా, మంగోలియా, ఉత్తర కొరియా, దక్షిణకొరియా, జపాన్, హాంకాంగ్ వంటి తూర్పు ఆసియా దేశాలకే పరిమితమయ్యాయని తెలిపారు.

'సీ' రకం కొవిడ్-19 వైరస్ జాడ ప్రధానంగా ఫ్రాన్స్, ఇటలీ, స్వీడన్, ఇంగ్లండ్ వంటి ఐరోపా దేశాల్లో ఉందని గుర్తించారు. చైనాలోని కరోనా కేసుల శాంపిళ్లలోని వైరస్ జన్యుక్రమానికి.. 'సి' రకం కరోనాలోని జన్యుక్రమానికి అసలు పోలికలు లేవని స్పష్టం చేశారు. అయితే సింగపూర్, హాంకాంగ్, దక్షిణ కొరియాలోని కరోనా వైరస్‌కు, 'సి' రకం కొవిడ్-19కు జన్యుక్రమంలో దగ్గరి పోలికలు ఉన్నాయన్నారు.

# లక్ష మరణాలు

## అమెరికాలో ఒక్కరోజే 1921 మంది మృతి



వాషింగ్టన్, లండన్, ఏప్రిల్ 10: తొలి కేసులో చైనాలో తేలి.. ఇతర దేశాలకు విస్తరించి వందలు, వేలల్లో మనుషుల ప్రాణాలను తీస్తున్న కరోనా మహమ్మారి దాహం తీరడం లేదు. కోరలు చాస్తున్న ఈ రాకసి వైరస్‌తో ప్రపంచవ్యాప్తంగా మరణాల సంఖ్య లక్ష దాటింది. ఈ మాయదారి వైరస్‌తో ఉక్కిరిబిక్కిరవుతున్న ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, అమెరికాల్లోనే ఎక్కువ మరణాలు సంభవించాయి. అమెరికాలో ఒక్కరోజే మహమ్మారి కారణంగా 1921 మంది మరణించారు. మొత్తం మరణాల సంఖ్య 17,995కు పెరిగింది. పాజిటివ్‌ల సంఖ్య 4.88 లక్షలకు చేరింది. అగ్రరాజ్యం ఆర్థికవ్యవస్థను ఈ మహమ్మారి కుప్పకూల్చడం, లాక్‌డౌన్ కారణంగా పరిశ్రమల మూతతో మూడువారాల్లోనే 1.6 కోట్లమంది ఉద్యోగాలు కోల్పోయారు. కరోనా హాట్‌స్పాట్లుగా మారిన న్యూయార్క్, న్యూజెర్సీ లాంటి చోట్ల శవాలు గుట్టలు పడుతున్నాయి. మొత్తం మరణాల్లో తొమ్మిది వేలు, పాజిటివ్‌లలో 2.20 లక్షల కేసులు ఇక్కడే నమోదయ్యాయి. దీంతో అమెరికాలోని దాదాపు ప్రతిఒక్కరూ ఏదో ఒక కట్టడిలోకి వెళ్లిపోయారు. జనాభాలో 22 కోట్లమంది, అంటే 97 శాతం మంది ఇళ్లకే పరిమితమయ్యారు. 50 రాష్ట్రాలను హెచ్చరిస్తూ తీవ్ర విపత్తు ఆదేశాలను అధ్యక్షుడు ట్రంప్ జారీ చేశారు. "పతనానికి ముందు కరోనా ఎగసిపడుతోంది. ఇన్ని మరణాలు గతంలో అమెరికా చూసి ఉండదు. మరణాల లెక్క భయంకరం, విషాదమయం" అని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వారంలో ప్రతి రోజూ అమెరికాకు దుర్భరంగానే గడుస్తోందని అంటువ్యాధుల సంస్థ డైరెక్టర్ ఆంటోనీ ఫౌసీ అన్నారు. అయితే, ప్రతిరోజూ 1,400 తగ్గకుండా ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య గురువారం ఒక్కసారిగా 200కి పడిపోవడం సానుకూల సూచనని‌స్తోందన్నారు.

### భారతీయుల ఉదారత

కరోనా కల్లోలంతో అల్లాడుతున్న అమెరికాలో భారత సంతతి సంపన్నులు గొప్ప ఉదారతను చాటుతున్నారు. కరోనాను కట్టడి, రోగులకు సహాయక చర్యల కోసం 'చలో గివ్ ఫర్ కొవిడ్-19' పేరుతో ఓ గ్రూప్‌ను ఏర్పాటు చేసి.. ఆరు లక్షల అమెరికన్ డాలర్లను సేకరించారు. తమ పూర్వీకులు పుట్టిన భారత్‌లో, తాము పుట్టి పెరిగిన అమెరికాలో ఈ నిధులతో కరోనాను నిరోధించేందుకు సహాయ చర్యలు చేపడతామని ఈ గ్రూప్‌ను ప్రారంభించిన సిలికాన్‌వ్యాలీకి చెందిన ఆనంద్ రాజారామన్ పేర్కొన్నారు. కాగా, విమానాలు రద్దయి అమెరికాలో చిక్కుకుపోయిన మన దేశస్థుల్లో ఇక్కడి భారతీయ కాన్సులేట్ ధైర్యం నింపుతోంది. అనూహ్యంగా అమెరికాలో కరోనా విజృంభించడంతో అక్కడి మన విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులకు తిరిగొచ్చే అన్నీ దారులు మూసుకుపోయాయి. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి గత నెల 18వ తేదీ నుంచి 24 గంటలూ మన కాన్సులేట్ కార్యాలయం పనిచేస్తూ... కుంగుబాటుకు గురయ్యేవారికి అండగా నిలుస్తోంది. సింగపూర్‌లో పనిచేస్తున్న 250 మంది భారతీయులు కరోనాబారిన పడ్డారు. ఇందులో సగంమంది పలుదేశాలకు చెందిన పనివాళ్లతో కలిసి డార్మెటరీల్లో ఉంటూ వైరస్ దాడికి గురయ్యారు. సింగపూర్‌కు వచ్చి స్థిరపడిన వారిలో మిగతా కేసులు బయటపడ్డాయి. ప్రస్తుతం వీరంతా ఆస్పత్రుల్లో కోలుకొంటున్నారని అక్కడి భారతీయ హైకమిషనర్ జావెద్ అష్రాఫ్ వెల్లడించారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాలు లక్ష దాటాయి. ఆర్థికంగా కరోనా తీసిన దెబ్బను తట్టుకోవడానికి యూరోపియన్ దేశాలు ఏకమయ్యాయి. 550 బిలియన్ డాలర్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాయి. కాగా, స్పెయిన్‌లో కొద్దికొద్దిగా కరోనా ప్రతాపం తగ్గుతుండగా.. చైనాలో కొత్తగా 42 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనా బారిన పడ్డ బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆస్పత్రిలో కోలుకుంటున్నారు.

## నేపాల్ నుంచి భారత్‌లోకి కరోనా!

- 50 మంది వైరస్ వేర్పాటువాదులు బిహార్లోకి?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కరోనావైరస్ భారత్‌లోకి నేపాల్ ద్వారా ప్రవేశించిందా..? ఇది ఓ పథకం ప్రకారం జరిగిన వ్యాప్తా? బిహార్-నేపాల్ సరిహద్దుల్లో భద్రతకు నియోగించిన సశాస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) పంపిన ఓ నివేదిక ఈ విషయాన్ని వెల్లడిస్తోంది. వైరస్ సోకిన సుమారు 40-50 మంది వేర్పాటువాదులు నేపాల్ నుంచి సరిహద్దుల ద్వారా బిహార్లోకి ప్రవేశించినట్లు ఆ నివేదిక తెలిపింది. నేపాల్‌లో ఉండే జలీమ్ ముఖియా అనే ఆయుధ వ్యాపారి సహకారంతో వీరంతా దేశంలోకి చొరబడ్డట్లు ఏప్రిల్ 3న ఎస్ఎస్‌బీ బిహార్‌ను అప్రమత్తం చేసింది. మళ్లీ శుక్రవారం కేంద్రాన్ని హెచ్చరించింది. కొన్ని విదేశీ ఇస్లామిక్ సంస్థలతో పనిచేసే 200 మంది కరోనా రోగులు నేపాల్‌లో సమావేశమయ్యారనీ, వారందరినీ దేశంలోకి చొప్పించి వ్యాధిని వ్యాప్తి చేయించడం లక్ష్యమని ఎస్ఎస్‌బీ తెలియజేసింది. ఇండో-నేపాల్ మాత్రమే కాక ఇండో భూటాన్ సరిహద్దులనూ ఎస్ఎస్‌బీ కాపలా కాస్తోంది. ఉత్తరాఖండ్, యూపీ, బిహార్, బెంగాల్, అసోం, అరుణాచల్ మీదుగా సాగే 2450 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఎస్ఎస్‌బీ గస్తీ తిరుగుతుంది. కరోనా రోగుల చొరబాటు గురించి 3న పశ్చిమ చంపారన్, బెటియా జిల్లాల కలెక్టర్లను, ఎస్పీలను ఎస్ఎస్‌బీ తొలుత అప్రమత్తం చేసింది. ఇండో నేపాల్ సరిహద్దు వెంబడి భద్రతను కట్టుదిట్టం చేసిందని ఎస్ఎస్‌బీ డీజీ కుమార్ రాజేశ్ చంద్ర చెప్పారు.

# 896 కొత్త కేసులు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని, 516 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారని వివరించింది. పాజిటివ్ కేసులు అత్యధికంగా మహారాష్ట్రలో (1,574) నమోదయ్యాయి. తర్వాత స్థానాల్లో ఢిల్లీ (898), తమిళనాడు (834) ఉన్నాయి. మహారాష్ట్రలో ఒక్క రోజే కొత్తగా 210 కేసులు, 13 మరణాలు నమోదు కావడం గమనార్హం. ఒక్క ముంబైలోనే 132 మంది రోగులను గుర్తించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కరోనా సోకిన మరో వైద్యుడు శుక్రవారం మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 207కు చేరింది. శుక్రవారం ఒక్కరోజే కొత్తగా 10 కేసులు నమోదయ్యాయి.

### లాక్‌డౌన్ పొడిగించిన పంజాబ్, రాజస్థాన్

లాక్‌డౌన్‌ను ఈనెల 30 అర్ధరాత్రి వరకు పొడిగించాలని పంజాబ్, రాజస్థాన్ నిర్ణయించాయి.

### క్వారంటైన్ కేంద్రంలో 10 నెలల శిశువు మృతి

ఉత్తరప్రదేశ్‌లోని ఒక క్వారంటైన్ కేంద్రంలో శుక్రవారం పది నెలల శిశువు మరణించింది. గురువారం సాయంత్రం నుంచి తట్టు లక్షణాలతో ఆ చిన్నారి బాధపడింది. శుక్రవారం ఉదయం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషాద ఘటన గోరఖ్‌పూర్ పొరుగున ఉన్న సిద్ధార్థ్ నగర్ జిల్లా ఉస్కా బజార్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆ చిన్నారి తల్లిదండ్రులు ముంబై నుంచి రావడంతో ఉస్కా బజార్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రంలో ఉంచారు.

### కోర్టులో దగ్గిన నిందితుడికి కరోనా

### జడ్జి, పోలీసులు క్వారంటైన్‌లోకి..

ఓ నిందితుడికి కరోనా వైరస్ సోకినట్లు తేలడంతో జడ్జి, ఏడుగురు పోలీసులు హోం క్వారంటైన్‌లోకి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటన పంజాబ్‌లో చోటుచేసుకుంది. స్నాచర్లుగా అనుమానిస్తున్న ఇద్దర్ని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో ఆ ఇద్దరు దగ్గుతూ ఉండడంతో జడ్జికి అనుమానం వచ్చింది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఒకరికి కరోనా సోకిందని నిర్ధారణ అయింది. ముగ్గురు వ్యక్తులకు కరోనా వైరస్ సోకిందని తేలడంతో గువాహటిలో వారు బస చేసిన మసీదుకు రాష్ట్ర ప్రభుత్వం సీల్ వేసింది. వారిలో ఇద్దరు ఢిల్లీ నిజాముద్దీన్ తబ్లీగీ జమాత్ సభలకు వెళ్లొచ్చిన వారు. ఈ మసీదులో గత నెల 12న జరిగిన కార్యక్రమానికి కనీసం 100 మంది హాజరయ్యారు.

# కరోనాతో ప్రకాశం మహిళ మృతి?

అడ్డగుట్ట/హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కరోనా లక్షణాలతో బాధపడుతూ ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు(54) శుక్రవారం హైదరాబాద్‌లో మృతిచెందింది. కుటుంబీకులు ఆమెను సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఈనెల 8న(బుధవారం) చేర్పించారు. శాంపిళ్లను సేకరించి నిర్ధారణ పరీక్షల కోసం నిమ్స్‌కు పంపించగా కరోనా ఉందంటూ గురువారం నివేదిక వచ్చింది. అప్పటికే ఆమె ఆరోగ్యం విషమించడంతో సదరు కార్పొరేట్ ఆస్పత్రి అంబులెన్స్‌లో శుక్రవారం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమెకు కరోనా లక్షణాలు ఉండటంతో కుటుంబ సభ్యులెవరూ అంబులెన్స్‌లో వెళ్లలేకపోయారు. వృద్ధురాలిని మధ్యాహ్నం ఒంటి గంటకల్లా గాంధీ ఆస్పత్రికి తరలించినా, మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఎవరూ పట్టించుకోలేదని.. ఆమె ఆయాసంతో బాధపడటాన్ని చూడలేక తానే సీపీఆర్ చేశానని అంబులెన్స్ టెక్నీషయన్ చెప్పాడు. బాధితురాలి కుటుంబీకులు లేకుండా మీరెలా తీసుకొస్తారని తనను ప్రశ్నించారని తెలిపాడు. సాయంత్రం నాలుగు గంటల వరకు అక్కడే ఉండి, ఆరోగ్యసిబ్బంది ఎవరూ స్పందించకపోవడంతో అంబులెన్స్‌ను అక్కడే వదిలేసి వచ్చానన్నాడు. కాగా, సదరు వృద్ధురాలు ఆస్పత్రికి తరలించే సరికే(మధ్యాహ్నం 3 గంటలకు) చనిపోయిందని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మృతదేహాన్ని ఇక్కడికెందుకు తీసుకొచ్చారని అంబులెన్స్ డ్రైవర్, టెక్నీషియన్లను ప్రశ్నించినట్లు ఆయన చెప్పారు. దీనిపై తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదరు వృద్ధురాలు కరోనాతో చనిపోయినట్లు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కాగా, బాధితురాలిని మెకానికల్ వెంటిలేటర్ సాయంతో గాంధీ ఆస్పత్రికి తరలించారని జిల్లా వైద్యాధికారులు తెలిపారు.

# భారత్‌లో సామాజిక వ్యాప్తి?

(మొదటిపేజీ తరువాయి)

మొదలైందనే వాదనకు బలం చేకూర్చేలా ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. ఐసీఎంఆర్ ఈ అధ్యయనం కోసం తెలంగాణలోని 2 జిల్లాల నుంచి శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న 190 మంది నుంచి శాంపిళ్లను సేకరించి నిర్ధారణ పరీక్షలు జరపగా 8 మందికి(4.2%) కరోనా ఉన్నట్లు గుర్తించారు. ఇక ఏపీలోని 2 జిల్లాల్లో 129 శాంపిళ్లను సేకరించి విశ్లేషించగా నలుగురికి(3.1%) పాజిటివ్ వచ్చింది. దీంతో ఏపీ, తెలంగాణల్లోనూ చాపకిందనీరులా సామాజికవ్యాప్తి జరుగుతోందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్లొచ్చిన సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన ఓ యువకుడికి తొలిసారి(మార్చి 31న) కరోనా పరీక్ష నిర్వహించినప్పుడు నెగెటివ్ రాగా, తాజాగా శుక్రవారం ఆయనకు పాజిటివ్ వచ్చింది. కరోనా ఇన్ఫెక్షన్ లక్షణాలు బయటపడకుండానే.. మర్కజ్‌కు వెళ్లొచ్చిన 22 రోజుల తర్వాత అతడికి పాజిటివ్ రావడం గమనార్హం. మార్చి 14కు ముందు వరకు శ్వాసకోశ సమస్యలున్న వారికి కరోనా ఇన్ఫెక్షన్ ముప్పు 0 శాతం ఉండగా, ఏప్రిల్ 2 నాటికి ఆ ముప్పు 2.6 శాతానికి పెరిగిందని కూడా ఐసీఎంఆర్ నివేదించింది. అటువంటి ఆరోగ్య సమస్యలున్న వారు, 50 ఏళ్లకు పైబడిన వారిపై వైద్య, ఆరోగ్య శాఖలు ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తుగా కరోనా పరీక్షలు చేస్తే పెనుముప్పు తప్పుతుంది.

### సామాజిక వ్యాప్తిలేదు: లవ్ అగర్వాల్

- దేశంలో 'కరోనా' సామాజిక వ్యాప్తి జరగడం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ శుక్రవారం స్పష్టం చేశారు. ప్రజలంతా అప్రమత్తతతో వ్యవహరించాల్సిన అవసరముందని హెచ్చరించారు. ఒకవేళ సామాజిక వ్యాప్తి ఉంటే వెంటనే ప్రజలకు తెలియజేస్తామన్నారు. గురువారం దేశవ్యాప్తంగా 16,002 కరోనా పరీక్షలు జరపగా, కేవలం 0.2% పాజిటివ్ వచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.
- భారత్‌లో కరోనా సామాజికవ్యాప్తి దశ మొదలైందని గతంలో ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) శుక్రవారం మాట మార్చింది. తాము ఇంతకుముందు ఇచ్చిన నివేదికలో తప్పులు దొర్లాయని.. భారత్‌లో ప్రస్తుతం జరుగుతున్నది స్థానిక వ్యాప్తి మాత్రమేనని స్పష్టం చేసింది.
- తమ రాష్ట్రంలో కరోనా సామాజిక వ్యాప్తి మొదలై ఉండొచ్చని పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్‌సింగ్ శుక్రవారం తెలిపారు. రాష్ట్రం నుంచి 1.40లక్షల మంది ప్రవాసులు, విదేశాలకు వెళ్లివచ్చినవారు ఉండటం తమ ఆందోళనను మరింత పెంచుతోందన్నారు. స్థానిక వ్యాప్తి ద్వారా 27 మందికి ఇన్ఫెక్షన్లు సోకాయన్నారు. ఈనేపథ్యంలోనే లాక్‌డౌన్‌ను మే 1 వరకు పొడిగించాలని నిర్ణయించామన్నారు.

# ప్రైవేటుకు 'నో'

- విదేశీ ప్రభుత్వాలకే క్లోరోక్విన్ సరఫరా




న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కరోనా నేపథ్యంలో 'గేమ్ చేంజర్'గా భావిస్తున్న మలేరియా మందు 'హైడ్రాక్సీ క్లోరోక్విన్'కు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా డిమాండు పెరిగిపోయింది. దేశీయ అవసరాల దృష్ట్యా.. ఈనెల 4న ఈ మందు ఎగుమతులపై భారత్ పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. కానీ, ట్రంప్ అభ్యర్థన మేరకు అమెరికాకు ఎగుమతి చేయాలని భారత్ నిర్ణయించింది. కాగా, హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఎగుమతులపై ఇప్పటికీ నిషేధం కొనసాగుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాకపోతే విదేశీ ప్రభుత్వాలకు మాత్రమే సరఫరా చేస్తామని, ప్రైవేటు కంపెనీలకు కాదని తెలిపాయి.

### దేశంలో క్లోరోక్విన్ కొరత లేదు: కేంద్రం

హైడ్రాక్సీ క్లోరోక్విన్‌కు దేశంలో ఎలాంటి కొరతా లేదని, దేశీయ మార్కెట్లో సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఈ మందు డిమాండు, నిల్వలపై తాము రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైతే ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఎన్‌పీపీఏ (నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ) చైర్మన్ సుబ్రాసింగ్ చెప్పారు. కాగా, 15 ఏళ్లు నిండని పిల్లలకు హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఇవ్వొద్దని ఆరోగ్య మంత్రిత్వశాఖ సూచించింది. అలాగే కంటి సమస్యలు ఉన్న పిల్లలకు, అతిసున్నితమైన (హైపర్ సెన్సిటివిటీ) పిల్లలకు కూడా ఈ మందు వాడకూడదని తెలిపింది.

# బొమ్మగీసి ఆపేశారు!

## కరోనా కట్టడిపై వియత్నాం విజయం.. ఫలితాన్ని ఇచ్చిన పోస్టర్ల ప్రచారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: చైనాలోని వూహాన్‌లో పుట్టిన కరోనా వైరస్.. ఎక్కడో దూరాన ఉన్న ఐరోపా దేశాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చైనాతో సంబంధం లేని చాలా దేశాల్లో రోజూ వేలల్లో పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. మరి.. చైనాకు ఆనుకుని ఉన్న దాని మిత్ర దేశం వియత్నాం పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో కదా..! కానీ.. ఈ కమ్యూనిస్టు దేశం కరోనా కోరలకు చిక్కలేదు. ముందే మేల్కొని తన ప్రజలను రక్షించుకుంది. వియత్నాంలో ఇప్పటివరకూ 88 వేల మందికి కరోనా పరీక్షలు చేస్తే 255 మందికి మాత్రమే పాజిటివ్ వచ్చింది. వారిలో 128 మంది కోలుకున్నారు కూడా. ఒక్క మరణం సంభవించ లేదు. గణాంకాలు ఆశ్చర్య పరుస్తున్నా ఇది వాస్తవం..! ఇది కరోనాపై వియత్నాం సాధించిన విజయం. ఈ విజయంలో అక్కడి చిత్రకారుల కీలక పాత్ర కూడా ఉంది.



### ఇంట్లో ఉండడమే నిజమైన దేశభక్తి..

కరోనా వైరస్ కలకలం నేపథ్యంలో వియత్నాం ముందే మేల్కొంది. మాస్కు ధరించిన ఆరోగ్య కార్యకర్త ప్రధాన కూడళ్లలో సైనికుడిలా నిలబడి 'ఇంట్లో ఉండడమే నిజమైన దేశభక్తి' అని ప్రచారం చేశారు. కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు అక్కడి చిత్రకారులు ఉద్యమ స్ఫూర్తితో సహకరించారు. లె డక్ హిప్ అనే ఆర్టిస్టు రూపొందించిన పోస్టర్ ఎనలేని ప్రచారాన్ని కల్పించింది. ఆరోగ్య కార్యకర్తతో చేయి కలిపి నినదిస్తున్న వ్యక్తి చిత్రంతో గీసిన బొమ్మ సాధారణ ప్రజానీకాన్ని ఆకట్టుకుంది. ప్రభుత్వ పిలుపు మేరకు మాస్కు ధరించాలని సూచించేలా ఉన్న మరో పోస్టర్‌ను లు యెన్ డిజైన్ చేశారు. ఈ పోస్టర్లను ఊరూ వాడా ఏర్పాటు చేయడంతో ప్రజల్లో అవగాహన పెరిగింది. హ్యాండ్ వాష్‌పై అవగాహనకు రూపొందించిన పాటలు కూడా మేలు చేశాయి. పామ్ త్రంగ్ హా అనే కళాకారుడు ప్రభుత్వ సహకారంతో రెండు స్టాంపులను డిజైన్ చేశారు. అందులో ఒకటి వైద్య సిబ్బంది కరోనా వైరస్ పరీక్షల్లో బిజీగా ఉన్న స్టాంప్. మరొక దానిలో పనిలో నిమగ్నమైన వైద్య సిబ్బంది వెనుక ఒక పిడికిలి కనిపిస్తుంది.



### ముందే మేల్కొని..

మిత్ర దేశం చైనాలో కరోనా కలకలం మొదలవగానే వియత్నాం ఫిబ్రవరి 1 నుంచే కొవిడ్-19 వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకుంది. పాఠశాలలు మూసేసింది. చైనా నుంచి వచ్చే విమానాలను నిషేధించింది. రెండు వారాల తర్వాత 14 రోజుల క్వారంటైన్‌ను అమలు చేసింది. విదేశాల నుంచి వచ్చిన వారిపై నిఘా పెట్టింది. సామూహిక వ్యాప్తికి అవకాశం లేకుండా ఏప్రిల్ 1న దేశవ్యాప్త లాక్‌డౌన్ అమలు చేసింది. ప్రజలను ఇళ్లకే పరిమితం కావాలని ఆదేశించింది. అనుమానం ఉన్న 67 వేల మందిని క్వారంటైన్‌కు తరలించింది. 88 వేల మందికి పరీక్షలు నిర్వహించింది. 255 మందికి కరోనా నిర్ధారణ కాగా వారందరికీ ప్రత్యేకంగా చికిత్స అందించింది. వారిలో 128 మంది కోలుకున్నారు.

### కఠిన శిక్షలు అమలు..

కరోనా కట్టడిలో విజయవంతమైన వియత్నాం కఠిన శిక్షలు అమలు చేయడానికీ వెనకాడలేదు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి, సోషల్‌మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేసిన వారికి జరిమానాలు విధించింది. మాస్కులు ధరించకుండా తిరిగే వారికి జైలుశిక్ష కూడా విధిస్తామని హెచ్చరించింది.

## జీవ ఉగ్రవాదం ముప్పు!

- భద్రతా మండలి భేటీలో గుటెరెస్ హెచ్చరిక

ఐరాస, ఏప్రిల్ 10: కొవిడ్-19 ప్రభావిత దేశాల మధ్య ఐక్యత, సంఘీభావం అవసరమని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సూచించింది. సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ ప్రయత్నాలకు మద్దతు ప్రకటించింది. కరోనాతో తలెత్తిన సంక్షోభంపై చర్చించేందుకు మండలి తొలిసారిగా సమావేశమైంది. డొమినికన్ రిపబ్లిక్ అధ్యక్షతన వీడియో లింక్ ద్వారా సమావేశం నిర్వహించారు. మండలిని ఉద్దేశించి గుటెరెస్ మాట్లాడుతూ.. సమితి ఏర్పడిన తర్వాత.. 75 ఏళ్లలో ప్రపంచం ఇంతటి భయంకర పరీక్షను ఎప్పుడూ ఎదుర్కోలేదన్నారు. ఇది సమితి అస్తిత్వానికి సవాలన్నారు. ప్రపంచంలో జీవాయుధ ఉగ్రదాడులు ఎలా ఉండవచ్చో, తాని ముప్పు ఎలా ఉంటుందో కొవిడ్-19 అర్థమయ్యేలా చేసిందని తెలిపారు.

### మాంస భక్షణపై కళ్లు తెరచిన చైనా

హాంకాంగ్, ఏప్రిల్ 10: ఏ జీవిని పడితే ఆ జీవిని తినడంపై చైనా కళ్లు తెరచింది. ఆ దేశంలోని మాంసం దుకాణాల వల్లే ప్రపంచం కరోనా గుప్పిట్లో విలవిల్లాడుతోందనే విమర్శలతో చైనా దిద్దుబాటు చర్యలకు దిగింది. దేశంలో మాంసభక్షణకై ఏయే జంతువులను పెంచుకోవచ్చో తెలుపుతూ ఒక ముసాయిదాను విడుదల చేసింది. దీనిపై వచ్చే నెల 8దాకా ప్రజల అభిప్రాయలను స్వీకరిస్తామని పేర్కొంది. ఈ జాబితాలో పందులు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, దుప్పులు, అల్పాకా, ఆస్ట్రిచ్‌లు ఉన్నాయి. నక్కజాతి జంతువులైన రకూన్లు, మింక్‌లను పెంచుకోవచ్చు కానీ.. తినరాదని సూచించింది. కుక్కలు, పిల్లులు, కరోనాకు కారణంగా భావిస్తున్న అలుగు పిల్లులు, గబ్బిలాలు, పునుగు పిల్లులు ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం.

### గృహ హింసపై ఫిర్యాదుకు 72177 35372

లాక్‌డౌన్ సమయంలో గృహహింసపై ఫిర్యాదు చేసేందుకు జాతీయ మహిళా కమిషన్ 72177 35372 వాట్సాప్ నంబరును ప్రారంభించింది. లాక్‌డౌన్ వేళ గృహ హింస కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ నంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. లాక్‌డౌన్ ఉన్నంత కాలం వరకే ఈ నంబరు పనిచేస్తుందని తెలిపింది.

### ఇంకా తేలని రైళ్ల పునఃప్రారంభం: కేంద్రం

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి రైళ్లు నడుస్తాయని జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర రైల్వే శాఖ ఖండించింది. రైళ్ల పునఃప్రారంభంపై తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. లాక్‌డౌన్ ముగిసిన తర్వాత ప్రయాణికుల ప్రయోజనాలు పరిరక్షించేలా తగిన నిర్ణయాలు తీసుకుంటామని, వాటిని ప్రజలకు వెల్లడిస్తామని స్పష్టం చేసింది.

## ఆయుధాల్లేకుండా యుద్ధమా!

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధం చేస్తున్న వైద్యసిబ్బందికి మాత్రం ఆ పరిస్థితి లేదు. మాస్కులు లేవు.. గ్లౌజులు లేవు.. ఐసోలేషన్ వార్డుల్లోకి వెళ్తున్నా వ్యక్తిగత రక్షణ పరికరాలు(పీపీఈ) లేవు. పైగా డ్యూటీ చేసి తీరాల్సిందేనని అధికారుల ఒత్తిళ్లు.. గట్టిగా ప్రశ్నిస్తే బెదిరింపులు..! దీంతో ప్రాణభయంతోనే ఐసోలేషన్ వార్డుల్లో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం వైద్యులెవరూ తాము విధులకు వెళ్లమని కరాఖండిగా చెప్పడం లేదు. కరోనా బాధితులకు చికిత్స చేయడానికి కూడా వెనుకడుగు వేయడం లేదు. కానీ.. తమ రక్షణ సంగతి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే వైద్య సిబ్బందికి అవసరమైన కనీస సౌకర్యాలను కూడా కల్పించలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. వైద్యుల ఆవేదనను అర్థం చేసుకోవాల్సింది పోయి బెదిరింపులకు పాల్పడుతోంది. రాష్ట్రంలో ఇప్పటికే ఐదుగురు వైద్య సిబ్బందికి కరోనా వైరస్ సోకింది. విజయవాడలో కూడా కరోనాతో చనిపోయిన వ్యక్తిని నలుగురు సిబ్బంది ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా తాకారు. అప్పటి నుంచి వారిలోనూ కరోనా లక్షణాలు బయటపడ్డాయి. ప్రస్తుతం వారి రిపోర్టులు బయటకు రానివ్వడం లేదు. రాష్ట్రంలో ఇలాంటి కేసులు చాలానే ఉన్నాయి. ప్రస్తుతం వైద్య సిబ్బంది అందరికీ ఎన్-95 మాస్కులు, గ్లౌజ్‌లు, ఇతర వ్యక్తిగత రక్షణ పరికరాలు అవసరమే. కానీ అధికారులు కేవలం ఐసోలేషన్ వార్డులలోకి వెళ్లే వారికి మాత్రమే ఎన్-95 మాస్కులు అవసరం, మిగిలిన వైద్యులకు అసలు మాస్కులే అక్కర్లేదన్నట్టు మాట్లాడుతున్నారు. తమకు మాస్కులు ఇవ్వడం లేదన్న విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించిన నర్సీపట్నం వైద్యుడిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కానీ అతని ఆవేదనను మాత్రం ప్రభుత్వం అర్థం చేసుకోలేదు. ప్రభుత్వం వైద్యులకు అవసరమైన పరికరాలు ఇవ్వకుండా, వారిపై ఒత్తిడి చేస్తే మాత్రం భవిష్యత్తులో వైద్యుల నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎవరూ ఆపలేరని కొంత మంది వైద్యులు అంటున్నారు.

### వలంటీర్లు, కార్యదర్శులకు భద్రతేదీ!

రాష్ట్రంలో రోజురోజుకూ కొవిడ్-19 కేసులు ఎక్కువగా నమోదవుతుండడంతో కరోనా లక్షణాలున్న వారిని తొలిదశలోనే గుర్తించి, నివారణ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి సర్వేకు ప్రాధాన్యత పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది వార్డు వలంటీర్లు, ఆరోగ్య కార్యదర్శులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. కానీ.. ఈ క్రమంలో వారు తమ ఆరోగ్యాన్ని, భద్రతను ఫణంగా పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు ఇవ్వకుండానే వారిని ఇంటింటికీ పంపిస్తున్నారు. పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కానీ, ఆ శాఖ ఉన్నతాధికారులు కానీ క్షేత్రస్థాయి పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మాస్కులు, గ్లౌజులు లేకుండానే ఇంటింటికీ తిరుగుతున్న వలంటీర్లను చూస్తే ప్రజల్లో చిన్నపాటి భయం. వాళ్లు ఎవరెవరిని కలిసి వచ్చారో.. ఏ ఇంట్లో ఏ వైరస్ ఉందో.. అది తమకెక్కడ అంటుకుంటుందోననే ఆందోళన! ఈ పరిస్థితుల్లో విధులు నిర్వర్తించడం వలంటీర్లు, ఆరోగ్య కార్యదర్శులకు ఇబ్బందిగా మారింది. రెడ్‌జోన్లుగా ప్రకటించిన ప్రాంతాలు, క్వారంటైన్ సెంటర్లలో పని చేసే వారి పరిస్థితి మరింత ఆందోళకరంగా ఉంది. సర్వే ప్రక్రియే భయం భయంగా సాగుతుంటే పింఛన్లు, తాత్కాలిక సహాయం రూపంలో ప్రభుత్వం అందిస్తున్న నగదును ఇంటింటికీ వెళ్లి అందించాల్సిన బాధ్యత కూడా వలంటీర్లే నిర్వర్తిస్తున్నారు. నగదును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా.. కరోనా క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఇంటింటికీ వెళ్లి అందజేయమనడం ప్రస్తుత ప్రభుత్వానికే చెల్లింది! కరోనా నేపథ్యంలో ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండా పని చేయాల్సి రావడం అవసరమా అనే ఆలోచన పలువురు వలంటీర్లలో కలుగుతోంది. ప్రాణాలకు ముప్పు అవకాశం ఉన్నందున ఈ ఉద్యోగాలు మానుకోవాలని కుటుంబసభ్యులు వారిపై ఒత్తిడి తెస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయి.

### తెలంగాణలో కొత్తగా 16 పాజిటివ్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్రవారం కొత్తగా మరో 16 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దీంతో తెలంగాణలో మొత్తం కేసుల సంఖ్య 487కి పెరిగింది. వరుసగా రెండు రోజులు 20 లోపే కొత్త కేసులు నమోదు కావడం కొంత ఊరట కలిగిస్తోందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెప్తున్నాయి. శుక్రవారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో కలిపి 12 కేసులు నమోదయ్యాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. కొత్తగా సిరిసిల్ల జిల్లా నుంచి ఒకరికి కరోనా సోకింది. దీంతో 27 జిల్లాలకు కరోనా వైరస్ పాకినట్లైంది.

### తెలంగాణలో మాస్కులు తప్పనిసరి

కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో భాగంగా ప్రజలంతా మాస్కులను ధరించడాన్ని తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎవ్వరైనా ఇళ్ల నుంచి బయటకు వస్తే మాస్కులను కచ్చితంగా ధరించాల్సిందేనని స్పష్టం చేసింది. కొందరిలో కరోనా లక్షణాలు బయటకు కనిపించనప్పటికీ ఫలితాల్లో వైరస్ ఉన్నట్లు నిర్ధారణ జరుగుతోంది.

### ఒడిసాలో మాస్క్ లేకుంటే.. రూ.200 జరిమానా

భువనేశ్వర్, ఏప్రిల్ 10: ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు ముఖానికి మాస్క్ ధరించని వారికి.. తొలి మూడుసార్లు రూ.200 చొప్పున, ఆపైన రూ.500 వంతున జరిమానా విధిస్తామని స్పష్టం చేసింది.

### నీట్ పరీక్ష కేంద్రాల మార్పునకు అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ పరీక్ష కేంద్రం మార్చుకునేందుకు ఎన్టీఏ అవకాశం ఇచ్చింది. లాక్‌డౌన్ నేపథ్యంలో సొంత నగరాలకు వెళ్లిన విద్యార్థులు అక్కడే పరీక్ష రాసేందుకు ఈ అవకాశం ఉపయోగపడనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com